
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
సూర్యాపేట
5
శుక్రవారం 10 మే 2024



చికెన్ ధరలు

గుడ్డు డజన్ ధర : 65

జిల్లా	లైవ్	డ్రెస్	స్కిన్‌లెస్
యాదాద్రి	రూ.162	235	267
సూర్యాపేట	రూ.165	240	270
నల్లగొండ	రూ.158	236	278


ఉష్ణోగ్రత గరిష్ఠం 39.5 । కనిష్ఠం 24.4



యాదాద్రి భువనగిరి జిల్లాకేంద్రంలో జరిగిన జనసభలో అభివాదం చేస్తున్న కేంద్ర హోంమంత్రి అమిత్‌షా, పక్కన సభకు హాజరైన బీజేపీ కార్యకర్తలు

భువనగిరి అభివృద్ధికి
మోదీ గ్యారంటీ

- జాతీయ రహదారులు, రైల్వే లేన్లు, ఎయిమ్స్ నిర్మాణం బీజేపీ ఘనత
- జన సభలో కేంద్ర హోంమంత్రి అమిత్‌షా



సభలో మాట్లాడుతున్న కేంద్ర హోంమంత్రి అమిత్‌షా, పక్కన ఎంపీ అభ్యర్థి బూర నర్సయ్యగౌడ్

భువనగిరి టౌన్, మే9: టెక్స్‌టైల్ పార్కు, జాతీయ రహదారుల నిర్మాణం, రైల్వే లేన్లు, స్టేషన్ల ఆధునికీకరణ, ఎయిమ్స్ ఆస్పత్రి తదితర పనుల్లో పురోగతి, భువనగిరి అభివృద్ధికి ప్రధాని నరేంద్ర మోదీ విశేష కృషి చేశారని బీజేపీ అగ్రనేత, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా అన్నారు. భువనగిరి బీజేపీ ఎంపీ అభ్యర్థి డాక్టర్ బూర నర్సయ్యగౌడ్‌కు మద్దతుగా స్థానిక జిల్లాకేంద్రం సమీపంలోని రాయిగిరిలో గురువారం నిర్వహించిన జనసభలో ఆయన మాట్లాడారు. రూ.1500కోట్లతో నేషనల్ టెక్స్‌టైల్ పాలసీ, కోట్లాది రూపాయలతో భూదాన్‌పోచంపల్లిలో ఏర్పాటు చేసిన టెక్స్‌టైల్ పార్క్‌తో 8లక్షల మంది చేనేత కార్మికులకు ఉపాధి లభించిందన్నారు. రూ.1400 కోట్లతో భువనగిరి నుంచి భూపాలపట్నానికి నాలుగులేన్ల జాతీయ రహదారి నిర్మాణం, సూర్యాపేట నుంచి సిద్దిపేటకు జాతీయ రహదారి, రాయిగిరి నుంచి వరంగల్‌కు మూడో రైల్వేలేన్, ఘట్కేసర్ నుంచి భువనగిరికి ఎంఎంటీఎస్, జనగాం, యాదాద్రి, కొమరవెల్లి రైల్వేస్టేషన్ల ఆధునికీకరణ పనులు సాగుతున్నట్లు తెలిపారు. రూ.1200 కోట్లతో బీబీనగర్‌లో ఏర్పాటు చేసిన ఎయిమ్స్ తెలంగాణ ప్రజలందరికీ వైద్యసేవలను అందిస్తోందని, త్వరలోనే పూర్తిస్థాయి సేవలు అందుబాటులోకి తెస్తామన్నారు. రూ.120కోట్లతో చేపడుతున్న భువనగిరి ఖిల్లా అభివృద్ధి పనులకు ఇటీవల ప్రధాని మోదీ వర్చువల్‌గా శంకుస్థాపన చేయగా, త్వరలో పనులు ప్రారంభం కానున్నాయన్నారు. కేంద్రంలో ప్రధాని మోదీ నేతృత్వంలో బీజేపీ ప్రభుత్వం మూడోసారి పక్కాగా కొలువుదీరనుండటంతో ఇక్కడ కూడా బీజేపీని గెలిపిస్తే భువనగిరిని ఎవరు ఊహించనంతగా అభివృద్ధి చేస్తామని, ఇది మోదీ గ్యారెంటీ అని చెప్పారు. ప్రధాని మోదీ, రాహుల్ గాంధీ నడుమ జరుగుతున్న 2024 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేసే అభ్యర్థులు లేకపోవడంతో ఆ పార్టీ అగ్రనేత సంతకాన్నే ఫోర్జరీ చేసి పార్టీ నుంచి సస్పెండైన వ్యక్తి కాళ్లు మొక్కి భువనగిరి బరిలో నిలిపిన దీనస్థితి కాంగ్రెస్ పార్టీదని ఎద్దేవా చేశారు.



మూసీని ప్రక్షాళన చేస్తా

ఎంపీగా తనను గెలిపిస్తే మూసీని ప్రక్షాళన చేస్తానని బూర నర్సయ్య గౌడ్ అన్నారు. భువనగిరి జనసభలో ఆయన మాట్లాడుతూ భువనగిరి నియోజకవర్గాన్ని నవరత్నాలుగా అభివృద్ధి చేస్తానన్నారు. నరేంద్రమోదీ సహకారంతో ఎయిమ్స్‌ను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తామన్నారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాశం భాస్కర్ అధ్యక్షతన జరిగిన సభలో పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ కాసం వెంకటేశ్వర్లు, రాష్ట్ర ఉపాధ్యక్షులు సంకినేని వెంకటేశ్వర్‌రావు, జి.మనోహర్‌రెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గూడూరు నారాయణరెడ్డి, పడాల శ్రీనివాస్, మాజీ ఎంపీ చాడ సురేశ్‌రెడ్డి, మాజీ ఎంటీసీ చైర్మన్ తాడూరి శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఆ మూడింటిది త్రికోణ బంధం

కాంగ్రెస్, బీఆర్ఎస్, ఎంఐఎంది త్రికోణ బంధమని కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఆరోపించారు. 60 ఏళ్లు పాలించిన కాంగ్రెస్ దేశానికి చేసింది ఏమీలేదని విమర్శించారు. అవినీతి, కుంభకోణాలు, పాకిస్థాన్‌కు భయపడే పాలననే సాగించారని విమర్శించారు. కేవలం ముస్లింల కోసమే ఉన్న ఎంఐఎంకు అభివృద్ధి ఊసే ఉండదన్నారు. ఏబీసీగా పేరొందిన ఆ త్రికోణ బంధంలో 'ఏ' అంటే అసదొద్దీన్ ఓవైసీ, 'బీ' అంటే బీఆర్ఎస్, 'సీ' అంటే కాంగ్రెస్ అని పేర్కొంటూ ఆ మూడు పార్టీలు అభివృద్ధి నిరోధకాలని, హిందువుల ప్రయోజనాలను రహస్యమిత్రులు దెబ్బతీస్తున్నారని ఆరోపించారు. పదేళ్ల మోదీ పాలనలో దేశమంతటా అందరికీ ఉపాధి, ఉద్యోగ, ఆర్థిక అవకాశాలు పెరిగాయన్నారు.



నామినేషన్ దాఖలు చేసేందుకు వెళ్తున్న బీజేపీ అభ్యర్థి ప్రేమేందర్‌రెడ్డి, చిత్రంలో లక్ష్మణ్ తదితరులు

ఉప ఎన్నిక అందరికీ
ప్రతిష్ఠాత్మకమే

- బలమైన అభ్యర్థులను దింపిన ప్రధానపార్టీలు
- కాంగ్రెస్ నుంచి తీన్మార్ మల్లన్న
- సిట్టింగ్‌ను నిలబెట్టుకునేందుకు బీఆర్ఎస్ కసరత్తు
- అభ్యర్థిగా విద్యార్థినేత రాకేష్‌రెడ్డికి చాన్స్
- బీజేపీ నుంచి ప్రేమేందర్‌రెడ్డి మరోసారి పోటీ
- మొత్తం 84 నామినేషన్లు
- చివరి రోజు 40 నామినేషన్లు

లోక్‌సభ ఎన్నికల సమరం వాడివేడిగా సాగుతుంటే, మరోవైపు శాసనమండలి పట్టభద్రుల నియోజకవర్గ ఉప ఎన్నికకు రంగం సిద్ధమవుతోంది. గురువారం నామినేషన్ల దాఖలు ప్రక్రియ ముగిసింది. ఈ ఉప ఎన్నికను అన్ని పార్టీలు ప్రతిష్ఠాత్మకంగా తీసుకొని బలమైన అభ్యర్థులను బరిలో దింపాయి. దీంతో ఈ ఎన్నిక ప్రాధాన్యాన్ని సంతరించుకుంది. కాగా, ఉప ఎన్నికకు మొత్తం 84మంది అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేశారు.

● ఆంధ్రజ్యోతిప్రతినిధి, నల్లగొండ

●7లో..

నల్లగొండను అగ్రగామిగా
నిలబెడతా

- ఉద్యోగ, ఉపాధి కల్పనకు ప్రత్యేక కార్యాచరణ
- ప్రతీ ఎకరాకు సాగునీరందించేలా ప్రణాళిక
- విస్తృతస్థాయిలో రైల్వే, రోడ్ కనెక్టివిటీకి కృషి
- పెండింగ్ ప్రాజెక్టుల పూర్తికి చర్యలు
- పేదలందరికీ కార్పొరేట్ స్థాయి విద్య, వైద్యం
- రికార్డు మెజార్టీతో గెలుస్తా
- 'ఆంధ్రజ్యోతి' ఇంటర్వ్యూలో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి కుందూరు రఘువీర్‌రెడ్డి



ఇంటర్వ్యూ

'నన్ను పార్లమెంట్ సభ్యుడిగా గెలిపిస్తే కేంద్ర నిధులను తీసుకురావడంతో పాటు, రాష్ట్ర ప్రభుత్వ తోడ్పాటుతో నల్లగొండ లోక్‌సభ నియోజకవర్గాన్ని దేశంలో అగ్రగామిగా నిలబెడతా. నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు, వ్యవసాయరంగాన్ని మరింత బలోపేతం చేసేలా అవసరమైన కార్యాచరణ అమలు చేస్తా. కేంద్ర నిధుల ద్వారా రైల్వే ప్రాజెక్టులు, జాతీయ రహదారుల నిర్మాణాలకు ప్రయత్నిస్తా. మంత్రులు, ఎమ్మెల్యేలు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలందరి సహకారంతో లోక్‌సభ సభ్యుడిగా గెలుపొందుతా. ఎస్ఎల్‌బీసీ సొరంగ మార్గం, నక్కలగండి, డిండి, నెల్లికల్లు, బ్రాహ్మణవెల్లంలతో పాటు ఇతర అన్ని ఎత్తిపోతల పథకాలను పూర్తిచేయించి నియోజకవర్గాన్ని సస్యశ్యామలం చేస్తా' అని నల్లగొండ లోక్‌సభ స్థానం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేస్తున్న కుందూరు రఘువీర్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. నియోజకవర్గంలోని పలు అంశాలను 'ఆంధ్రజ్యోతి' ఇంటర్వ్యూలో ఆయన వెల్లడించారు.

● ఆంధ్రజ్యోతిప్రతినిధి, నల్లగొండ

ఆంధ్రజ్యోతి: ప్రచారం ఎలా సాగుతోంది? ప్రజల నుంచి స్పందన ఎలా ఉంది?

రఘువీర్: ఎండల తీవ్రత ఉన్నా, ప్రచారానికి ఎక్కడికి వెళ్లినా, ఎక్కడ సభ, సమావేశం నిర్వహించినా అపూర్వ ఆదరణ లభిస్తోంది. మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డితో పాటు ఎమ్మెల్యేలు, నాయకులు, కార్యకర్తలు విస్తృతస్థాయిలో ప్రచారంలో పాల్గొంటున్నారు. మిత్రపక్షాలైన సీపీఎం, సీపీఐ, తెలంగాణ జనసమితి నేతలు, కార్యకర్తలు కూడా అన్ని చోట్లా సంపూర్ణంగా మాతో కలిసివచ్చి ప్రచారంలో పాల్గొంటున్నారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, కాంగ్రెస్, మిత్రపక్ష నేతలంతా రికార్డు మెజార్టీతో గెలిపిస్తామని హామీ ఇస్తుండడం నాపై వారికున్న నమ్మకాన్ని సూచిస్తోంది. వారి విశ్వాసాన్ని వమ్ము చేయకుండా నియోజకవర్గాన్ని దేశంలో నెంబర్ వన్‌గా తీర్చిదిద్దేందుకు శాయశక్తులా కృషి చేస్తా.

ఆంధ్రజ్యోతి: నిరుద్యోగ సమస్య పరిష్కారానికి ఏం చేస్తారు?

రఘువీర్: యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుపరచేందుకు వీలుగా పరిశ్రమల ఏర్పాటుకు ప్రయత్నిస్తా. హైదరాబాద్-నల్లగొండ ఐటీ కారిడార్, స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ల ఏర్పాటు, వ్యవసాయాధారిత వాణిజ్యాభివృద్ధికి దోహదపడే డ్రైపోర్టు, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లను ఏర్పాటు చేయిస్తా. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో సకాలంలో జాబ్ క్యాలెండర్ నిర్వహిస్తూ ఉద్యోగ నియామకాలకూ ప్రయత్నం చేస్తా. నిరుద్యోగ సమస్యలేకుండా జీవనోపాధి కల్పించడమే లక్ష్యంగా పనిచేస్తా.

ఆంధ్రజ్యోతి: మునిసిపాలిటీ, పంచాయతీల్లో మౌలిక వసరుల కల్పనకు మీరిచ్చే భరోసా?

రఘువీర్: మునిసిపాలిటీ, పంచాయతీల్లోనే కాదు నియోజకవర్గంలో అత్యధికంగా ఉన్న గిరిజన తండాల్లో నాణ్యమైన మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకుంటా. పీసీసీ ప్రకటించిన మ్యానిఫెస్టో ప్రకారం స్థానిక సంస్థలకు కేంద్రం నుంచి నేరుగా నిధులు అందించేందుకు ప్రయత్నిస్తా. రహదారులు, పట్టణాల్లో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీలు, పార్కులు, నిరంతరం తాగునీటి సరఫరా, గృహ అవసరాలకు నాణ్యమైన విద్యుత్ సరఫరాకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటా.

ఆంధ్రజ్యోతి: సాగర్‌లో పూడికతీత, సీపేజ్ మరమ్మతులకు మీరు ఎలాంటి కృషి చేస్తారు?

రఘువీర్: నాగార్జునసాగర్ ప్రాజెక్టులో పూడికతీత చేపట్టేందుకు కేంద్ర నిధులు తెచ్చేందుకు పార్లమెంటు వేదికగా ప్రయత్నిస్తా. సీపేజ్ మరమ్మతులు, ప్రాజెక్టు నవీకరణకు అవసరమైన నిధులను కేంద్ర పథకాల ద్వారా తీసుకువస్తాం.

ఆంధ్రజ్యోతి: పేదలకు విద్య, వైద్యం దూరమవుతున్న నేపథ్యంలో మీరిచ్చే భరోసా ఏంటి?

రఘువీర్: పేదవర్గాలకు కూడా కార్పొరేట్ స్థాయి విద్యావకాశాలు కల్పించడమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రణాళిక రూపొందించింది. ప్రతీ మండలంలో ఇంటర్నేషనల్ స్కూళ్లను ఏర్పాటు చేయిస్తా. ప్రతీ జిల్లాకు ఒక నవోదయ పాఠశాల, కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుకు చర్యలు తీసుకుంటా. ఐటీఐలను స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లుగా మార్చి జాబ్ ఓరియంటెడ్ కోర్సులను అందుబాటులోకి తెచ్చేందుకు అవసరమైన సహకారమందిస్తా. పేదలందరికీ కార్పొరేట్ వైద్యమందేలా చర్యలు తీసుకుంటాం. ప్రతీ పీహెచ్‌సీలో 24 గంటల పాటు వైద్యులు, అవసరమైన మందులు అందుబాటులో ఉండేందుకు సహకారం అందిస్తా.

ఆంధ్రజ్యోతి: రైల్వేలైన్ల అభివృద్ధికి మీ ప్రణాళిక?

రఘువీర్: ఇటీవల పీసీసీ ప్రకటించిన మ్యానిఫెస్టో మేరకు హైదరాబాద్-విజయవాడ నడుమ సూర్యాపేట, కోదాడ నియోజకవర్గాలను కలుపుతూ జాతీయరహదారి వెంబడి అత్యాధునిక ర్యాపిడ్ రైల్వే వ్యవస్థ ఏర్పాటుకు ప్రయత్నిస్తాం. అదేవిధంగా హుజూర్‌నగర్ నియోజకవర్గానికి రైల్వేలైన్ ఏర్పాటుకు, ఇప్పటికే ఉన్న విష్ణుపురం-మేళ్లచెరువు- జగ్గయ్యపేట మార్గంలో ప్యాసింజర్ రైళ్ల నిర్వహణకు చర్యలు తీసుకుంటాం. ఎన్నాళ్లగానో సర్వే దశలో ఉన్న నల్లగొండ-మాచర్ల, గద్వాల-నాగర్‌కర్నూల్-డిండి-దేవరకొండ- సూర్యాపేట-డోర్నకల్ రైల్వేలైన్ల ఏర్పాటుకు ప్రయత్నం చేస్తా.

ఆంధ్రజ్యోతి: జాతీయ రహదారుల విస్తరణకు చర్యలు తీసుకుంటారు?

రఘువీర్: మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి సహకారంతో నియోజకవర్గంలో నాణ్యమైన రోడ్లను ఏర్పాటు చేయిస్తాం. జిల్లా కేంద్రమైన నల్లగొండ చుట్టూ ఔటర్‌రింగురోడ్డు ఏర్పాటుకు ఇప్పటికే మంత్రి ప్రణాళిక రూపొందించి అమలు చేస్తున్నారు. కొండమల్లేపల్లి-నల్లగొండ రోడ్డును జాతీయ రహదారుల కింద చేపట్టి విస్తరణకు ప్రయత్నిస్తా. ఇప్పటికే ఉన్న జాతీయ రహదారులపై ట్రాఫిక్ ఇబ్బందులున్న ప్రాంతాల్లో ఫ్లైఓవర్ బ్రిడ్జిలు, అండర్ పాస్ బ్రిడ్జిల ఏర్పాటుకు ప్రయత్నిస్తా. వాణిజ్య, వ్యాపారపరంగా దోహదపడే మార్గాలను జాతీయ రహదారుల కింద చేపట్టేందుకు కృషి చేస్తా. నియోజకవర్గంలో ప్రతీ మూలకు బీటీరోడ్లు వేయిస్తా.

ఆంధ్రజ్యోతి: ఆయకట్టు, నాన్ ఆయకట్టులో సాగునీటి సమస్య పరిష్కారానికి మీ ఎజెండా?

రఘువీర్: నాగార్జునసాగర్, ఎస్ఆర్ఎస్పీ రెండోదశ కింద పార్లమెంట్ పరిధిలో సాగునీటి కల్పన జరుగుతోంది. భారీనీటి పారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సహకారంతో నియోజకవర్గంలో ప్రతీ ఎకరాకు సాగునీరందించడమే లక్ష్యంగా పనిచేస్తా. ఇప్పటికే ఉన్న ప్రాజెక్టుల కింద చివరి ఎకరం వరకు నీరందేలా స్పష్టమైన ప్రణాళిక అమలయ్యేలా చూస్తా. కాల్వలకు మరమ్మతులు చేయిస్తా. పెండింగ్ పనుల పూర్తికి సహకరిస్తా. అదేవిధంగా నికరజలాల కేటాయింపులు ఉన్న ఎస్ఎల్‌బీసీ (శ్రీశైలం ఎడమగట్టు కాల్వ) సొరంగమార్గాన్ని రానున్న రెండేళ్లలో పూర్తిచేయడం ద్వారా నల్లగొండ ఉమ్మడి జిల్లాకు సాగు, తాగునీటి ఇక్కట్లు లేకుండా చేస్తా. దేవరకొండ ప్రాంతానికి సాగునీరందించే డిండి, నక్కలగండి ఎత్తిపోతలు, నాగార్జునసాగర్ నియోజకవర్గంలోని నెల్లికల్లుతో పాటు, నల్లగొండ అసెంబ్లీ పరిధిలోని ప్రాంతాలకు నీరందించే బ్రాహ్మణవెల్లంల లిఫ్ట్, మిర్యాలగూడ, హుజూర్‌నగర్ నియోజకవర్గాల్లో చేపట్టిన పలు ఎత్తిపోతల పథకాలను నిర్ణీత కాలవ్యవధిలో పూర్తిచేయించేందుకు కృషి చేస్తా. మంత్రులు, ఎమ్మెల్యేలతో కలిసి ఈ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేయిస్తా.

ఆంధ్రజ్యోతి: కాంగ్రెస్‌తో పాటు, బీఆర్ఎస్, సీపీఎం, సీపీ ఐ, బీజేపీకి చెందిన ఉద్దండనేతలంతా మీ నియోజకవర్గంలోనే ఉన్నారు? అలాంటి చోట చిన్న వయసులో మీకు ఎంపీగా పోటీచేసే అవకాశం వచ్చింది. దీన్ని మీరెలా భావిస్తున్నారు?

రఘువీర్: ఎంతో అనుభవజ్ఞులైన నేతలున్న ఈ ప్రాంతం నుంచి నేను ఎంపీగా పోటీచేయడం సంతోషం కలిగిస్తోంది. వారందరి సరసన నాకు ఈ ప్రాంత ఓటర్లు చోటిస్తారని, వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా నిలబెట్టుకుంటానని మాట ఇస్తున్నా.

ఆంధ్రజ్యోతి: ప్రచారంలో సీనియర్ నేత, మీ తండ్రి జానారెడ్డి ఎలాంటి సూచనలిస్తున్నారు?

రఘువీర్: సుదీర్ఘ రాజకీయ అనుభవమున్న ఆయన మార్గదర్శనంలోనే మా ప్రచారం కొనసాగుతోంది. ఈ ప్రాంతంలో సమస్యలపై, ప్రజల ఈతి బాధలపై, వాటి పరిష్కారాలపై ఆయనకున్న అవగాహన మాకు ఉపయోగపడుతోంది. పార్టీలో నాయకులను సమన్వయం చేసుకోవడానికి, మిత్రపక్షాల మద్దతు సాధించడానికి ఆయన సూచనలతో ముందుకెళుతున్నాం. ఈ ప్రాంతాన్ని అన్ని రంగాల్లో ముందుంచాలనే ఆయన కోరికను నెరవేర్చడమే లక్ష్యంగా పనిచేస్తున్నాం.

గుణాత్మక విద్యను అందించాలి

కలెక్టర్ ఎస్.వెంకట్రావ్



విద్యార్థినికి ప్రశంసాపత్రం అందజేస్తున్న కలెక్టర్ వెంకట్రావ్

సూర్యాపేటఅర్బన్, మే 9: విద్యార్థులకు గుణాత్మకమైన విద్యనందించి జిల్లాలో మంచి ఫలితాలు సాధించామని కలెక్టర్ ఎస్.వెంకట్రావ్ అన్నారు. గురువారం జిల్లా కలెక్టరేట్‌లో విద్యాశాఖ ఆధ్వర్యంలో పదో తరగతి ఫలితాల్లో 10 జీపీఏ సాధించిన ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాల విద్యార్థులను సన్మానించి మాట్లాడారు. జిల్లాలో పదో తరగతిలో ప్రత్యేక తరగతులు చేపట్టి నాణ్యమైన విద్యనందించామని, పది పరీక్షలు పకడ్బందీగా చేపట్టామన్నారు. ప్రభుత్వ లక్ష్యం ప్రతీ విద్యార్థి ఉత్తీర్ణత పొందాలనే దిశగా ముందస్తు ప్రణాళికతో విద్యా బోధనలో విప్లవాత్మక మార్పులు తెచ్చామన్నారు. జిల్లాలో అన్ని పాఠశాలలు, వసతిగృహాల్లో మెరుగైన సదుపాయాలు కల్పించామన్నారు. జిల్లాలో 354 మంది విద్యార్థులు 10 జీపీఏ సాధించారని తెలిపారు. రాష్ట్రస్థాయిలో జిల్లా ఆరో స్థానంలో నిలిచిందని, మున్ముందు రోజుల్లో మొదటి స్థానం నిలిచేలా విద్యార్థులకు విద్యాబోధన అందించేలా చర్యలు తీసుకుంటామన్నారు. సూర్యాపేట డివిజన్ పరిధిలో ఉత్తమ మార్కులు సాధించిన 193 మంది విద్యార్థులకు మెమొంటోలు, శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో డీఈవో అశోక్, ఏడీ శైలజ, మండల విద్యాశాఖ అధికారులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. అదే విధంగా పదో తరగతి ఫలితాల్లో జిల్లా కేంద్రానికి చెందిన న్యూమిలీనియం పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థులు 10 జీపీఏ సాధించగా కలెక్టర్ వెంకట్రావ్ విద్యార్థులను సన్మానించారు. కార్యక్రమంలో బాల్తు లక్ష్మీశ్రీనివాస్, విద్యార్థులు పి.సాధన, ఎండీ జువేరియానా, ఎండీ ముక్తార్ అహ్మద్, వి.ప్రశాంత్ పాల్గొన్నారు.

హోం ఓటింగ్‌ను సజావుగా నిర్వహించాలి

సూర్యాపేట(కలెక్టరేట్): సజావుగా హోం ఓటింగ్ నిర్వహించాలని కలెక్టర్ ఎస్.వెంకట్రావ్ అన్నారు. కలెక్టరేట్‌లో ఆయన మాట్లాడుతూ జిల్లాలో హోం ఓటింగ్‌ను 665 మంది వినియోగించుకోనున్నట్టు తెలిపారు. ఇప్పటివరకు దివ్యాంగులు 542 మందికి 526 మంది హోం ఓటింగ్‌ను వినియోగించుకున్నారని తెలిపారు. జిల్లాలో 96.10శాతం హోంఓటింగ్ నమోదైందని, 27 రూట్లలో 29 బృందాలు ఈ ఓటింగ్‌ను నిర్వహించాయని తెలిపారు.

ప్రభుత్వ ఆస్పత్రుల్లో ప్రసవాల సంఖ్య పెంచాలి

హుజూర్‌నగర్, మే 9: ప్రభుత్వ ఆస్పత్రుల్లో సాధారణ ప్రసవాల సంఖ్య పెంచాలని డీఎంహెచ్‌వో డాక్టర్ కోటాచలం అన్నారు. గురువారం పట్టణంలోని ఏరియా ఆస్పత్రిలో నిర్వహించిన సమన్వయ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. పల్లె దవాఖానాల్లో పూర్తిస్థాయి వైద్యం అందించాలన్నారు. గర్భిణులకు పౌష్టికాహారం, రక్తహీనత, వ్యాయామంపై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో వెంకటరమణ, జయశ్యాంసుందర్, కళ్యాణ్‌చక్రవర్తి, నజియా, కరుణ్‌కుమార్, అంజయ్య, ఇందిరాల రామకృష్ణ, వీరయ్య పాల్గొన్నారు.

ఎన్నికల నిబంధనలు పాటించాలి : ఎస్పీ



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ రాహుల్‌హెగ్డే

సూర్యాపేటక్రైం, మే 9: ఎన్నికల నిబంధనలు పాటించాలని ఎస్పీ రాహుల్‌హెగ్డే అన్నారు. గురువారం జిల్లా పోలీస్ కార్యాలయంలో జరిగిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 11వతేదీ నుంచి ఎన్నికల రోజు అయిన 13వ తేదీ వరకూ జిల్లా వ్యాప్తంగా 48గంటల నిబంధనలు పటిష్ఠంగా అమలు చేస్తామన్నారు. హోటళ్లు, లాడ్జీల్లో కొత్తవ్యక్తులకు ఆశ్రయమివ్వొద్దని, అదేవిధంగా గ్రామాల్లో కూడా పరిచయం లేని వ్యక్తులకు ఆశ్రయం కల్పించవద్దన్నారు. ఎన్నికల సందర్భంగా 144సెక్షన్ అమల్లో ఉంటుందని, సభలు, సమావేశాలు, ర్యాలీలకు అనుమతి లేదన్నారు. ఎక్సైజ్‌శాఖ నిబంధనల ప్రకారం మద్యం దుకాణాలు సైతం మూసివేయాలన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద మొబైల్స్, వాకీటాకీలలో ప్రచారం చేయవద్దన్నారు. పోలింగ్‌బూత్ లోపల ఓటువేసే ప్రక్రియను ఫొటోలు, వీడియోలు తీయవద్దని సూచించారు. పారా మిలటరీ సిబ్బందితో ఏరియా డామినేషన్, ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ నాగేశ్వర్‌రావు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ధాన్యం త్వరగా కొనుగోలు చేసేలా చర్యలు

జిల్లా సహకార అధికారి పద్మ



కొనుగోలు కేంద్రంలో రికార్డులను పరిశీలిస్తున్న పద్మ

తుంగతుర్తి, మే 9: త్వరగా ధాన్యం కొనుగోలు చేసేవిధంగా చర్యలు చేపట్టాలని జిల్లా సహకార అధికారి పద్మ కోరారు. గురువారం మండలకేంద్రంలోని వ్యవసాయ సహకార సంఘం కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కొనుగోలుకేంద్రాన్ని ఆమె తనిఖీచేసి రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రైతులకు ఇబ్బందులు కలగకుండా త్వరగా ధాన్యాన్ని కొనుగోలు చేసి సకాలంలో రైతులకు బిల్లులు అందేలా చూడాలన్నారు. కొనుగోలు కేంద్రాల్లో ఏమైనా సమస్యలున్నా తమ దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించుకోవాలన్నారు. ఆమె వెంట అసిస్టెంట్ రిజిస్ట్రార్ అశోక్‌కుమార్, సీఈవో వెంకటేశ్వర్లు ఉన్నారు.

యాదగిరీశుడికి శాస్త్రోక్తంగా నిత్యపూజలు


యాదగిరీశుడికి హారతి సమర్పిస్తున్న అర్చకులు

భువనగిరి అర్బన్, మే 9: యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహస్వామి దివ్యక్షేత్రంలో గురువారం నిత్య తిరుకల్యాణపర్వాలు పాంచరాత్రాగమ శాస్త్రరీతిలో వైభవంగా కొనసాగాయి. ప్రధానాలయ నైరుతి దిశలో అష్ట భుజి ప్రాకార మండపంలో ఉత్సవమూర్తులను పట్టువస్త్రాలు, ముత్యాలు, బంగారు, వజ్రాభరణాలతో దివ్యమనోహరంగా అలంకరించిన అర్చకులు గజవాహన సేవలో తీర్చిదిద్ది వేదమంత్ర పఠనాలు, మంగళవాయిద్యాల నడుమ సేవోత్సవం నిర్వహించారు. ఉత్సవ మూర్తులను కల్యాణమండపంలో అధిష్ఠింప జేసి విశ్వక్సేనుడికి తొలిపూజలతో కల్యాణ తంతు కొనసాగింది. కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులకు అర్చకులు స్వామివారి శేషవస్త్రాలు అందజేసి ఆశీర్వచనం చేశారు. ముందుగా సుదర్శన శతక పఠనంతో హోమ పూజలు నిర్వహించారు. ప్రభాతవేళ గర్భాలయంలోని స్వయంభువులను సుప్ర భాతంతో మేల్కొలిపిన అర్చకులు నిజాభి షేకం, నిత్యార్చనలు చేశారు. పాతగుట్ట ఆల యంలో సాంప్రదాయరీతిలో నిత్య పూజలు వైభవంగా నిర్వహించారు. అదేవిధంగా అనుబంధ శివాలయంలో పర్వతవర్ధిని సమేత రామలింగేశ్వరస్వామికి నిత్యపూజలు, యాగశాలలో నిత్య రుద్రహ వనం, శైవాగమ పద్ధతిలో నిర్వహించారు. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ.18,56,670 ఆదాయం సమ కూరినట్లు ఆలయ ఈవో ఏ.భాస్కర్‌రావు తెలిపారు. కాగా, ఆలయంలో అష్టోత్తర పూజలు జరిగే ప్రదేశంలో సువర్ణపుష్పార్చన జరిపే ఉత్సవమూ ర్తుల పవిత్రతను కాపాడేందుకు చుట్టూను ఇత్తడి కంచెను ఏర్పాటు చేశారు. అందులో భాగంగా ప్రహ్లాద చరిత్రను తెలిపే గర్భాలయం దర్వాజ పైన మెరుగులు దిద్దే పనులు కొనసాగుతున్నాయి.

ఉష్ణోగ్రతలు తగ్గుముఖం

● ఉమ్మడి నల్లగొండలో చాలాచోట్ల 40డిగ్రీల లోపే ఉష్ణోగ్రతలు


ఉదయ సముద్రంలో ఈత కొడుతున్న యువకులు

నల్లగొండ, మే 9: ఉమ్మడి నల్లగొండ జిల్లాలో ఎండలు తగ్గుముఖం పడుతున్నాయి. ఇటీవల కురిసిన వర్షాలకు వాతావరణంలో మార్పులతో గురువారం ఎండ ప్రభావం తక్కువగానే ఉంది. సూర్యాపేట జిల్లా మోతె మండలం మామిళ్లగూడెంలో అత్యధికంగా 40.4డిగ్రీలు, నడిగూడెంలో అత్యల్పంగా జాజిరెడ్డిగూడెంలో 29.7డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. నల్ల గొండ జిల్లా మాడ్గులపల్లిలో అత్యధికంగా 41.1 డిగ్రీలు, అత్యల్పంగా మర్రిగూడ మండలంలో 35.0డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. యాదాద్రిభువ నగిరి జిల్లా బొమ్మలరామారం మండలంలో అత్యధికంగా 38.0 డిగ్రీలు, రామన్నపేట మండలం ఎల్లంకి గ్రామంలో అత్యల్పంగా 35.6 డిగ్రీల ఉష్ణో గ్రతలు నమోదయ్యాయి. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో చాలా చోట్ల 40డిగ్రీల కంటే లోపే ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

మరో అడుగు పెరిగిన మూసీ నీటిమట్టం

కేతేపల్లి, మే 9: ఉమ్మడి నల్లగొండ జిల్లాలో నాగార్జునసాగర్ తర్వాత రెండో పెద్ద నీటి వనరుగా ఉన్న మూసీ ప్రాజెక్టు నీటిమట్టం 626 అడుగు లకు చేరింది. 645అడుగులు (4.46టీఎంసీలు) పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం గల మూసీ ప్రాజెక్టు నీటిమట్టం ప్రాజెక్టు ఆయకట్టుకు యాసంగి నీటి విడుదలను నిలిపి వేసే నాటికి 618 అడుగుల కనిష్ఠ స్థాయికి పడిపోయింది. ఈ క్రమంలో హైదరాబాద్, మూసీ పరిసరాల్లోని కంపెనీల నుంచి వచ్చే మురుగు, వృథా నీరంతా ఎగువ మూసీ నుంచి ప్రాజెక్టులోకి వచ్చి చేరుతోంది. ఈ క్రమంలో ఒక్కో పాయింటు చొప్పున పెరుగుతూ వచ్చిన ప్రాజెక్టు నీటిమట్టం 618అడుగుల నుంచి 8అడుగులు పెరిగి గురువారం సాయంత్రానికి 626అడుగులుగా నమోదయ్యింది. ప్రస్తుతం ప్రాజెక్టు నీటిమట్టం626.15అడుగులు (0.94టీఎంసీలు)గా ఉంది. ఎగువ నుంచి 327క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతుంది. గత ఏడాది ఇదే సమయానికి ప్రాజెక్టు నీటిమట్టం 639అడుగులు(2.99టీఎం సీలు) ఉండగా ఇన్‌ఫ్లో 1080క్యూసెక్కులుగా ఉంది.

కృషి ఉంటే ఏదైనా సాధించొచ్చు

● ఐఎఫ్ఎస్‌లో 106వ ర్యాంకర్ అనూష


భర్త రామకృష్ణతో అనూష

మిర్యాలగూడ టౌన్, మే 9: కృషి, పట్టుదల ఉంటే ఏదైనా సాధించవచ్చుని నిరూపించారు నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణానికి చెందిన కొల్లి అనూష. ఆటో డ్రైవర్ వెంకన్న కుమార్తె అనూష చిన్న వయసులోనే ఉన్నత లక్ష్యాలను ఏర్పరుచుకుని ఆ దిశగా అడుగులు వేసింది. పదో తరగతిలో 563/600 మార్కులు సాధించిన అనూషకు ఎస్ఆర్ కళాశాల వరంగల్‌లో ఉచిత అడ్మిషన్ ఇచ్చారు. దీంతో కష్టపడి చదివి జేఈఈ (2008)లో ఉత్తమ ర్యాంకు సాధించి ప్రతిష్ఠాత్మక ఐఐటీ ముంబైలో ప్రవేశం పొంది 2012లో ఇంజనీరింగ్ పూర్తి చేశారు. అనంతరం హైదరాబాద్‌లో ఉద్యోగంలో చేరిన అనూషకు వావిళ్లపల్లి రామకృష్ణతో వివాహం కాగా ఇద్దరు సంతానం కలిగారు. అయినప్పటికీ పట్టువీడని అనూష భర్త, తల్లిదండ్రుల సహకారంతో సివిల్స్‌పై దృష్టి సారించింది. అదేపట్టుదలతో చదివిన అనూష ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్ ఫలితాల్లో 106వ ర్యాంకు సాధించి ఈతరం యువతకు ఆదర్శంగా నిలిచారు.

ప్రజాస్వామ్యంలో ఓటే వజ్రాయుధం


సమావేశంలో మాట్లాడుతున్న బొమ్మరబోయిన కేశవులు

చండూరు, మే 9: ప్రజాస్వామ్యంలో ఓటు అత్యంత కీలకమని, పార్ల మెంట్ ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ తప్పకుండా ఓటు హక్కును వినియోగిం చుకోవాలని ఎలక్షన్ వాచ్ కమిటీ జాతీయ చైర్మన్ డాక్టర్ బొమ్మరబోయిన కేశవులు అన్నారు. చండూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఓటు హక్కు విని యోగంపై గురువారం విద్యార్థులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమా నికి ఆయన హాజరై మాట్లాడారు. ప్రజలు ఓటు హక్కును వినియోగిం చుకోకపోవడం వల్ల ఓటింగ్ శాతం తగ్గి, ప్రజాస్వామ్యం ప్రమాదంలో పడుతుందన్నారు. ఎన్నికల్లో అవినీతి, అక్రమాలతోపాటు, మద్యం, డబ్బు పంపిణీ వంటి వాటికి పాల్పడితే కేంద్ర ఎన్నికల సంఘం రూపొందిం చిన సీ-విజిల్ యాప్‌లో ఫిర్యాదు చేయాలన్నారు. ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించేందుకు ఎన్నికల సంఘం అన్ని ఏర్పాట్లు చేసినట్లు వెల్లడిం చారు. అనంతరం విద్యార్థులతో ఓటు నమోదుపై ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో జలసాధన సమితి జాతీయ అధ్యక్షుడు దుశ్చర్ల సత్యనారా యణ, కళాశాల ప్రిన్సిపాల్ నర్సింహులు, అధ్యాపకులు చైతన్య సుధ, బాల సైదులు, పద్మజ, జ్యోతి, పర్వతాలు, స్వామి నాయక్, చాడోర్, ఇడికుడ స్వామి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్, బీజేపీ రహస్య మిత్రులు

● దివ్యాంగుల కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ ముత్తినేని వీరయ్య వర్మ


మాట్లాడుతున్న ముత్తినేని వీరయ్యవర్మ

నకిరేకల్, మే 9 : బీఆర్ఎస్, బీజేపీలు రహస్య మిత్రులని దివ్యాంగుల కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ ముత్తినేని వీరయ్య వర్మ అన్నారు. ఆయన చేపట్టిన విజయ కల్ప యాత్ర-2 గురువారం నల్లగొండ జిల్లా నకిరేకల్‌కు చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దివ్యాంగులు, వృద్ధులు, వితంతువుల మద్దతు చామల కిరణ్‌కుమార్‌రెడ్డికి ఉందన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ 14 సీట్లు గెలుస్తుందన్నారు. గత బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రం అధోగతి పాలైందన్నారు. కేంద్రంలోని బీజేపీ తెలంగాణ రాష్ట్రానికి చేసింది గుండు సున్నా అని అన్నారు. ఎన్నికల తర్వాత దివ్యాంగులు, వృద్ధులు, వితంతువుల పింఛన్ పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో పెరిక కార్పొరేషన్ సాధన సమితి అధ్యక్షుడు మల్లికార్జునరావు, కాంగ్రెస్ దివ్యాంగుల విభాగం అధ్యక్షుడు సతీష్‌గౌడ్, నాయకులు రవికుమార్‌గౌడ్, మధు, దొడ్డయ్య, సైదులు పాల్గొన్నారు.

మోదీని గద్దెదించితేనే దేశానికి భవిత

● రాజకీయ విశ్లేషకుడు పరకాల ప్రభాకర్



మిర్యాలగూడలో జరిగిన సెమినార్‌లో మాట్లాడుతున్న పరకాల ప్రభాకర్

మిర్యాలగూడ, మే 9: పార్లమెంట్ ఎన్నికల్లో మోదీ ప్రభుత్వాన్ని గద్దె దించితేనే దేశానికి భవిత ఉంటుందని ప్రముఖ రాజకీయ విశ్లేషకుడు పరకాల ప్రభాకర్ అన్నారు. 'పదేళ్ల కేంద్ర పాలనలో ప్రజాజీవితం-దేశ భవిష్యత్' అనే అంశంపై నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలోని ఐఎంఏ భవన్‌లో గురువారం జరిగిన సదస్సులో మాట్లాడారు. తన అనుకూల మీడియాలో, వాట్సాప్ యూనివర్సిటీలో అబద్ధపు ప్రచారంతో ప్రజల మెదళ్లలోకి విషబీజాలు నాటుతున్నారని అన్నారు. దేశ విభజన కాలంలో ఉన్న ఒత్తిళ్ల మధ్య కూడా రాజ్యాంగ రచన కమిటీ దేశం అన్ని వర్గాల ప్రజలకు చెందినదని రాజ్యాంగ పీఠికలో పొందుపర్చడం గొప్ప విషయమన్నారు. పదేళ్ల మోదీ పాలనలో ప్రజా జీవితం పూర్తిగా ధ్వంసమైందన్నారు. 25ఏళ్లలోపు యువత 83శాతం మంది ఉద్యోగాలు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. బ్రిటీష్ కాలంలో కూడా లేనంతగా భారత్‌లో బీజేపీ పాలనలో ఆర్థిక వ్యత్యాసం పెరిగిందని వరల్డ్ ఇన్ ఈక్వాలిటీపై సర్వే చేసిన సంస్థ స్పష్టం చేసిందన్నారు. టీపీజేఏసీ నాయకుడు రవిచందర్, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి మాట్లాడారు. సామాజికవేత్త ముఖ్వా రామారావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జాడి రాజు, ప్రజాసంఘాల ఐక్యవేదిక కన్వీనర్ బీసం రామయ్య, మట్టిమనిషి వేనేపల్లి పాండురంగారావు, డబ్బికార్ మల్లేష్, వీరేపల్లి వెంకటేశ్వర్లు, రవినాయక్, సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

సూర్యాపేటఅర్బన్: బీజేపీ పాలనలో భారత ప్రజాస్వామ్యాన్ని ప్రమాదంలోకి వెళ్లిందని రాజకీయ, ఆర్థిక విశ్లేషకుడు డాక్టర్ పరకాల ప్రభాకర్, టీజేఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంట్ల ధర్మార్జున్ అన్నారు. 'ప్రమాదంలో భారత ప్రజాస్వామం' అనే అంశంపై సూర్యాపేట జిల్లాకేంద్రంలోని ఆర్ఆర్ఆర్ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన సెమినార్‌లో మాట్లాడారు. ఎలక్టోరల్ బాండ్‌లతో అవినీతిని చట్ట బద్ధం చేశారన్నారు. కార్యక్రమంలో తండు నాగరాజుగౌడ్, కుంచం చంద్రకాంత్, వీరేష్‌నాయక్, బొడ్డు శంకర్, గోపి, వెంకన్న, ఉపేందర్ పాల్గొన్నారు.

బీజేపీ విజయాన్ని ఏ శక్తీ ఆపలేదు

● ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు లక్ష్మణ్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న లక్ష్మణ్

రామగిరి, మే 9: బీఆర్ఎస్, కాంగ్రెస్, కమ్యూనిస్టులు బీజేపీని ఓడించేందుకు ఏకమయ్యారని, ఎన్ని శక్తులు ఏకమైనా బీజేపీ విజయాన్ని ఆపలేవని ఆ పార్టీ ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు కె. లక్ష్మణ్ అన్నారు. నల్లగొండ జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ పాటు ఉమ్మడి నల్లగొండ జిల్లాలో రెండు లోక్‌సభ స్థానాల్లో బీజేపీ అభ్యర్థుల గెలుపు ఖాయమన్నారు. ప్రధాని మోదీ మూడోసారి ప్రధాని అవుతారన్నారు. జూన్ 4వ తేదీ తర్వాత రాష్ట్రంలో ఊహించని విధంగా రాజకీయ మార్పులు జరుగుతాయన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి రక్తంలోనే కాంగ్రెస్ లేదని, కేసీఆర్‌పై వ్యతిరేకతతో అదృష్టవశాత్తు ఆయన సీఎం అయ్యారే తప్ప ప్రజలు కాంగ్రెస్‌పై ప్రేమతో ఓటు వేయలేదన్నారు. అబద్ధాల హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ నిరుద్యోగులను, యువతను, రైతాంగాన్ని మోసం చేస్తోందన్నారు. కాంగ్రెస్ నాయకుడు రాహుల్‌గాంధీ దేశాన్ని విచ్ఛిన్నం చేసేందుకు విభజన రాజకీయాలు చేస్తున్నారన్నారు. ప్రజల్లో చీలిక తెచ్చి రాజకీయ లబ్ధి పొందాలని కాంగ్రెస్ చూస్తోందన్నారు. పట్టభద్రుల బీజేపీ ఎమ్మెల్సీ అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ ఏవీఎన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ ఎన్. రామచందర్‌రావు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు నాగం వర్షిత్‌రెడ్డి, నాయకులు చాడ శ్రీనివాస్‌రెడ్డి, పిల్లి రామరాజుయాదవ్, కంకణాల నివేదిత, కన్మంతరెడ్డి శ్రీదేవిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ను గెలిపిస్తే పథకాలు గ్యారెంటీ

● మహిళా కాంగ్రెస్ జాతీయ అధ్యక్షురాలు అల్కా లాంబ


మాట్లాడుతున్న అల్కా లాంబ

భువనగిరి టౌన్, మే 9: పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపిస్తే మహిళలకు ఆరు గ్యారెంటీ పథకాలు, ఐదు న్యాయాలు చేస్తామని ఆ పార్టీ మహిళా విభాగం జాతీయ అధ్యక్షురాలు అల్కా కపూర్ లాంబ అన్నారు. యాదాద్రిభువనగిరిలో జిల్లాకేంద్రంలో గురువారం జరిగిన నారి న్యాయ్ సమ్మేళనంలో మాట్లాడారు. మహిళలకు ఆర్థిక, సామాజిక భద్రత కల్పిస్తామని, చట్టసభల్లో 33శాతం రిజర్వేషన్లు వెంటనే అమలు చేస్తామన్నారు. మహిళా చట్టాలను మరింత పటిష్టం చేసి నిందితులకు వెంటనే శిక్షపడేలా చట్టాలను రూపొందిస్తామన్నారు. అన్ని రంగాల్లో పురుషులతో సమానంగా మహిళలకు అవకాశం కల్పిస్తామన్నారు. దేశానికి తొలి మహిళా రాష్ట్రపతి, మహిళా ప్రధానిని, రాజకీయ పార్టీ జాతీయ మహిళా అధ్యక్షురాలిని అందించిన ఘనత కాంగ్రెస్ పార్టీదేనన్నారు. రాష్ట్రంలో కొలువుదీరి కాంగ్రెస్ ప్రభుత్వం 100 రోజుల్లోనే మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, వడ్డీ లేని రుణాలు అందిస్తుందన్నారు. పదేళ్ల బీజేపీ పాలనలో దేశవ్యాప్తంగా అన్ని రంగాల్లో మహిళలు అణచివేతకు, వివక్షతకు గురయ్యారన్నారు. మహిళా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు సునీతరావు మాట్లాడుతూ కాంగ్రెస్‌తోనే మహిళాభ్యుదయం సాధ్యమన్నారు. భువనగిరి కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి చామలకిరణ్‌కుమార్‌రెడ్డిని గెలిపించాలన్నారు. మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు నీలం పద్మ అధ్యక్షతన సమ్మేళనం నిర్వహించారు.

అవినీతి బీజేపీని గద్దెదించాలి : సీపీఎం

నల్లగొండ రూరల్, మే 9: అవినీతి బీజేపీని గద్దె దించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి అన్నారు. నల్లగొండ జిల్లాకేంద్రంలో గురువారం జరిగిన సమావేశంలో మాట్లాడారు. ప్రధాని మోదీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి దేశాన్ని పెట్టుబడిదారులకు దోచిపెట్టారన్నారు. ఆదానీ అవినీతి సామ్రాజ్యాన్ని బట్టబయలైనా ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. నల్లగొండ కాంగ్రెస్ అభ్యర్థి రఘువీర్‌ని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు పాలడుగు నాగార్జున, కొండ అనురాధ, సత్యనారాయణ, కొండ వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

ఉప ఎన్నిక అందరికీ ప్రతిష్టాత్మకమే

● పట్టభద్రుల ఎమ్మెల్సీ ఉప ఎన్నికకు బలమైన అభ్యర్థులను దింపిన ప్రధానపార్టీలు ● కాంగ్రెస్ నుంచి తీన్మార్ మల్లన్న ● బీఆర్ఎస్ నుంచి ఏనుగుల రాకేష్‌రెడ్డి ● బీజేపీ నుంచి ప్రేమేందర్‌రెడ్డి


తీన్మార్ మల్లన్న, ఏనుగుల రాకేష్‌రెడ్డి, గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి

(ఆంధ్రజ్యోతిప్రతినిధి, నల్లగొండ)

ఒకవైపు లోక్‌సభ ఎన్నికల సమరం వాడివేడిగా సాగుతోంది. మరోవైపున శాసనమండలి పట్టభద్రుల నియోజకవర్గ ఉప ఎన్నిక రంగం సిద్ధమవుతోంది. నామినేషన్ల దాఖలు ఘట్టం గురువారం ముగిసింది. 2021లో జరిగిన ఎన్నికలో ద్వితీయ స్థానంలో ఉన్న తీన్మార్ మల్లన్న (చింతపండు నవీన్‌కుమార్) ఈసారి అధికార కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలో దిగగా, బీజేపీ నుంచి అప్పటి అభ్యర్థి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి మరోసారి రంగంలోకి వచ్చారు. బీఆర్ఎస్ నుంచి ఏనుగుల రాకేష్‌రెడ్డి పోటీ చేస్తున్నారు. మొత్తం 12 జిల్లాల్లో 4,61,806 మంది ఓటర్లున్న ఈ నియోజకవర్గంలో, మూడు పార్టీల నుంచి కీలకమైన అభ్యర్థులు బరిలో దిగడం, గత ఎన్నికల్లో బలమైన ఓట్లు సాధించిన తెలంగాణ జనసమితి అధినేత ప్రొఫెసర్ కోదండరామ్ ఈసారి బరిలో లేరు. తెలంగాణ జనసమితితో పాటు, వామపక్షాలు కూడా ఈసారి కాంగ్రెస్ అభ్యర్థికే మద్ధతిస్తాయనే చర్చ సాగుతున్న నేపథ్యంలో ఈ ఎన్నిక ప్రాధాన్యతను సంతరించుకుంది.

2021 ఎన్నికల్లో తలపడిన హేమాహేమీలు

ఈ స్థానానికి 2021లో జరిగిన ఎన్నికల్లో హేమాహేమీలు బరిలో నిలవడంతో రాష్ట్రమంతా ఈ ఎన్నికపైనే దృష్టి సారించింది. మొత్తం 71 మంది పోటీచేసిన ఆ ఎన్నికలో బీఆర్ఎస్ నుంచి డాక్టర్ పల్లా రాజేశ్వర్ రెడ్డి, తెలంగాణ జనసమితి నుంచి ప్రొఫెసర్ కోదండరామ్, కాంగ్రెస్ నుంచి రాములునాయక్, బీజేపీ నుంచి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి, సీపీఐ నుంచి జయసారథిరెడ్డి, టీడీపీ నుంచి డాక్టర్ చెరుకు సుధాకర్, వైటీపీ నుంచి రాణిరుద్రమదేవి, స్వతంత్ర అభ్యర్థులుగా తీన్మార్‌మల్లన్న, ఎన్. తిరుమలరావు పోటీచేశారు. ఆ ఎన్నికల్లో తెలంగాణ ఉద్యమ నేపథ్యమున్న నేతలు, ఉన్నతవిద్యావంతులు, జర్నలిస్టులు బరిలో ఉండడంతో పోటీ తీవ్రంగా కొనసాగింది. మొదటి ప్రాధాన్యతలో గెలుపు ఎవరికీ దక్కకపోవడంతో ఎలిమినేషన్ పద్ధతిలో ప్రాధాన్య ఓట్లను లెక్కించారు. చివరకు పల్లా రాజేశ్వర్‌రెడ్డి విజయం సాధించగా, స్వతంత్ర అభ్యర్థిగా బరిలో ఉన్న తీన్మార్ మల్లన్న ద్వితీయస్థానంలో ప్రొఫెసర్ కోదండరామ్ తృతీయ స్థానంలో నిలిచారు. 2007లో మొదటిసారి జరిగిన ఎన్నికల్లో తెలంగాణ వాదంతో కపిలవాయి దిలీప్‌కుమార్ మొదటిసారి విజయం సాధించారు. ఆ తర్వాత 2009లోనూ ఆయనే మరోసారి గెలు పొందారు. 2015లో జరిగిన ఎన్నికల్లో బీఆర్ఎస్ నుంచి బరిలో నిలిచిన పల్లా రాజేశ్వర్‌రెడ్డి గెలుపొందారు. తిరిగి 2021లోనూ పల్లానే గెలిచారు. 2023లో జరిగిన శాసనసభ ఎన్నికల్లో పల్లా రాజేశ్వర్‌రెడ్డి జనగామ ఎమ్మెల్యేగా గెలవడంతో ఈ స్థానానికి ఖాళీ ఏర్పడడంతో ప్రస్తుతం ఎన్నిక జరుగుతుంది.

భారీగా నామినేషన్ల దాఖలు

గురువారం 40 నామినేషన్ల దాఖలయ్యాయి. మొత్తం 84 మంది అభ్యర్థులు 117సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. కాంగ్రెస్ నుంచి తీన్మార్ మల్లన్న, బీజేపీ నుంచి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి, బీఆర్ఎస్ నుంచి ఏనుగుల రాకేశ్‌రెడ్డి నామినేషన్లు దాఖలు చేయగా, ఇతర అభ్యర్థులు పెద్దసంఖ్యలో నామినేషన్లు వేశారు. గత ఎన్నికల్లోనూ 71 మంది బరిలో ఉండగా, ఈసారి కూడా నామినేషన్లు దాఖలు చేసినవారంతా బరిలో ఉంటారా? లేక విరమించుకుంటారా? అనే అంశం 13వ తేదీన తేలనుంది.

2021లో వచ్చిన మొదటిప్రాధాన్యత ఓట్లు

పల్లారాజేశ్వర్‌రెడ్డి - (1,11,190)
తీన్మార్‌మల్లన్న - (83,629)
ప్రొఫెసర్ కోదండరామ్ - (70,472)
ప్రేమేందర్‌రెడ్డి - (39,268)
రాములునాయక్ - (27,713)
జయసారథిరెడ్డి - (8732)

జిల్లా	పోలింగ్ స్టేషన్లు	పురుషులు	స్త్రీలు	ఇతరులు	మొత్తం
సిద్ధిపేట	5	3,118	1,553	0	4,671
జనగామ	27	14,862	8,457	1	23,320
హన్మకొండ	67	25,608	17,875	0	43,483
వరంగల్	59	26,907	16,687	0	43,594
మహబూబాబాద్	36	22,842	11,917	0	34,759
ములుగు	17	6,558	3,679	0	10,237
జె.భూపాలపల్లి	16	7,956	4,504	0	12,460
భద్రాద్రి	55	22,486	17,412	0	39,898
ఖమ్మం	115	50,517	33,085	4	83,606
యాదాద్రి	37	20,740	13,186	0	33,926
సూర్యాపేట	71	34,043	17,250	0	51,293
నల్లగొండ	95	51,370	29,189	0	80,559
మొత్తం	600	2,87,007	1,74,794	5	4,61,806

ప్రతిష్టాత్మకంగా తీసుకున్న మూడు పార్టీలు

లోక్‌సభ సమరం ముగిసి, ముగియక మునుపే వచ్చిన ఎమ్మెల్సీ ఎన్నిక మూడు ప్రధాన పార్టీలకూ ప్రతిష్టాత్మకంగా మారింది. సిట్టింగు సీటును నిలబెట్టుకోవడమే లక్ష్యంగా బీఆర్ఎస్ పావులు కదుపుతుంటే, ఎట్టి పరిస్థితుల్లోనూ ఈసారి ఈసీటుపై కండువా వేయాలని కాంగ్రెస్ పట్టుదలతో వ్యవహరిస్తోంది. గత ఎన్నికల్లోనూ బలమైన ఓట్లు సాధించడమే కాకుండా విద్యావంతుల ఆదరణ తమకే ఉందనే సంకేతాలనివ్వాలనే సంకల్పంతో బీజేపీ ఈ స్థానంపై కన్నేసింది. తక్కువ సమయమే ఉన్నప్పటికీ ఉన్న కొద్ది సమయాన్ని సద్వినియోగం చేసుకొని సోషల్‌మీడియా, మీడియా వేదికగా విస్తృతంగా ప్రచారం సాగించి పట్టభద్రుల్లో పట్టుసాధించాలని మూడు ప్రధాన పార్టీలు రంగంలోకి దిగాయి. మరోవైపున నిరుద్యోగులు, ఉద్యోగుల సమస్యలను ఎజెండా చేసుకొని పలువురు విద్యావంతులు, మేధావులు, రిటైర్డ్ అధికారులు సైతం స్వతంత్ర అభ్యర్థులుగా పోటీలో నిలిచారు. వీరంతా నిర్వహించబోయే ప్రచారసరళి, తెర మీదకు తెచ్చే అంశాల ఆధారంగా ఎన్నిక కొనసాగనుందనే అభిప్రాయం వెల్లడవుతోంది. ప్రధాన పార్టీలు సీరియస్‌గానే తీసుకోవడంతో అభ్యర్థుల ఎంపికలోనూ జాగ్రత్తలు పాటించాయి. అధికార కాంగ్రెస్ పార్టీ గత ఎన్నికల్లో ఈ సీటులో పోటీపడి ద్వితీయస్థానంలో నిలిచిన తీన్మార్ మల్లన్నకు టిక్కెట్ ముందుగానే ప్రకటించింది. సిట్టింగ్ స్థానం కావడంతో దీన్ని నిలబెట్టుకోవడమే లక్ష్యంగా బీఆర్ఎస్ సైతం బలమైన విద్యార్థినేతగా పేరున్న రాకేష్‌రెడ్డిని పోటీలో నిలిపింది. మరోవైపు బీజేపీ సైతం గత ఎన్నికలో తలపడ్డ ప్రేమేందర్‌రెడ్డిని మరోసారి పోటీకి దింపింది. మూడు పార్టీలు బలమైన అభ్యర్థులను పోటీకి నిలపడం ద్వారా ఈసీటులోనూ రసవత్తర పోరుకు తెరలేపాయి.

12 జిల్లాల్లో 4,61,806 మంది ఓటర్లు

వరంగల్- ఖమ్మం -నల్లగొండ పట్టభద్రుల నియోజకవర్గ పరిధిలో ప్రస్తుతం 12 జిల్లాలు ఉన్నాయి. మొత్తం 4,61,806 మంది గ్రాడ్యుయేట్లు ఓటర్లుగా నమోదయ్యారు. మొత్తం 600 పోలింగ్ కేంద్రాలను ఈ ఎన్నిక కోసం ఏర్పాటు చేస్తున్నారు. అత్యధికంగా ఖమ్మం జిల్లాలో 83,926 మంది ఓటర్లకు 115, నల్లగొండలో 80599 మంది ఓటర్లకు 95 పోలింగ్ స్టేషన్లుండగా, సిద్దిపేట జిల్లాలో 4671 మంది ఓటర్లకు ఐదు పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేస్తారు.

నామినేషన్ల దాఖలుకు వినూత్న రీతిలో..

నలగొండ టౌన్: వరంగల్- ఖమ్మ- నల్లగొండ పట్టభద్రుల నియోజకవర్గ ఉప ఎన్నిక నామినేషన్ల చివరి రోజున ఇద్దరు అభ్యర్థులు వినూత్న రీతిలో నిరసన తెలియచేస్తూ నామినేషన్లను దాఖలు చేశారు. తెలంగాణ రాష్ట్ర పునర్నిర్మాణ పార్టీ తరపున నామినేషన్ దాఖలుచేసిన భువనగిరికి చెందిన పూస శ్రీనివాస్ మా కొలువులు మాక్కావాలి అంటూ... అర్ధనగ్నంగా రిక్షా తొక్కుతూ, స్వతంత్ర అభ్యర్థి నల్లగొండకు చెందిన అన్న తేలు రవి నిరుద్యోగులకు జరుగుతున్న అన్యాయాలకు నిరసనగా తోపుడు బండిపై పండ్లు అమ్ముతూ నామినేషన్ దాఖలు చేసేందుకు వచ్చారు.


రిక్షాపై వెళ్తున్న పూస శ్రీనివాస్


తోపుడుబండి నెట్టుకుంటూ నామినేషన్ వేసేందుకు వెళ్తున్న రవి

నల్లగొండలో ఊహించని అభివృద్ధి చేస్తా

రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి


తిప్పర్తి మండలం అనిశెట్టిదుప్పలపల్లిలో మాట్లాడుతున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

తిప్పర్తి, మే 9: నల్లగొండ నియోజకవర్గాన్ని ఊహించని విధంగా అభివృద్ధి చేస్తానని రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. నల్లగొండ జిల్లా తిప్పర్తి మండల పరిధిలోని అనిశెట్టి దుప్పలపల్లి గ్రామంలో గురువారం జరిగిన కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. నల్లగొండ ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వం రావాలని కోరుకున్నారని వారు కోరుకున్న విధంగా అత్యంత ఎక్కువగా నల్లగొండను అభివృద్ధి చేస్తానన్నారు. ప్రభుత్వం ఏర్పాటైన మూడు నెలల్లోనే ముఖ్యమంత్రి నియోజకవర్గం కంటే ఎక్కువ అభివృద్ధి పనులను నల్లగొండ నియోజకవర్గంలో ప్రారంభించుకున్నామని తెలిపారు. రైతులకు గతంలోని కాంగ్రెస్ ప్రభుత్వంలోనే వైఎస్ఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలోనే విద్యుత్ సబ్‌స్టేషన్‌లు, రోడ్లు వేశామని మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వంలోనే రోడ్లు, విద్యుత్ సబ్‌స్టేషన్‌లను నిర్మాణం చేసుకోబోతున్నామన్నారు. ఎంపీ ఎన్నికల్లో నల్లగొండ అభ్యర్థి కుందూరు రఘువీర్‌రెడ్డి గెలుపు కోసం ప్రతి పార్టీ కార్యకర్త సైనికుడిలా పనిచేసి అత్యధిక మెజార్టీ ఇవ్వాలని సూచించారు. నల్లగొండ మార్కెట్ చైర్మన్‌గా ఎన్నికైన జూకూరి రమేష్‌ను సన్మానించారు. కార్యక్రమంలో గుత్తా అమిత్‌రెడ్డి, జడ్పీటీసీ పాశం రాంరెడ్డి, ఎంపీపీ నాగులవంచ విజయలక్ష్మీ లింగారావు, మార్కెట్ చైర్మన్ జూకూరి రమేష్, డీసీసీబీ డైరెక్టర్ పాశం సంపత్‌రెడ్డి, ముత్తినేని శ్యాంసుందర్, నాయకులు బద్దం సుధీర్, ముత్తినేని నాగేశ్వర్‌రావు, జానయ్య, దాసరి జానయ్య, పిచ్చిరెడ్డి, పుల్లబట్ల ప్రవీణ్‌కుమార్, జాకటి మోష, దాసరి రవీందర్, అంజి పాల్గొన్నారు.

రాష్ట్రంలో మరో 20 ఏళ్లు కాంగ్రెస్‌దే అధికారం

కనగల్: మరో 20 ఏళ్ల పాటు రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉంటుందని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. కనగల్ మండలంలోని దర్వేశిపురం స్టేజీ సమీపంలో నిర్వహించిన కాంగ్రెస్ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి రఘువీర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలపించాలని కార్యకర్తలకు సూచించారు. కార్యకర్తలే బలమని వారికి అండగా ఉంటానన్నారు. కనగల్ అంటేనే కాంగ్రెస్‌కు కంచుకోటని గత అసెంబ్లీ ఎన్నికల కంటే ఎక్కువ మెజార్టీని పార్లమెంట్ ఎన్నికల్లో తీసుకురావాలని సూచించారు. మూడేళ్లలో నల్లగొండను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానన్నారు. అన్ని గ్రామాలకు పక్కా రోడ్లు ఏర్పాటు చేయిస్తానన్నారు. ఆగస్టు 15వ తేదీ లోగా రూ.2 లక్షల రైతు రుణమాఫీ చేస్తామన్నారు. ఆరు గ్యారెంటీల్లో భాగంగా అర్హులందరికీ పక్కా ఇళ్లను పేదలకు నిర్మిస్తామన్నారు. జిల్లా రైతుల చిరకాల స్వప్నం ఎస్ఎల్‌బీసీ సొరంగం పనులను పూర్తి చేయించి ప్రతి ఎకరాకు సాగునీటిని అందించేందుకు కృషి చేస్తామన్నారు. కేసీఆర్ చేసిన పాపాలతోనే కరువు దాపురించిందని విమర్శించారు. పార్లమెంట్ ఎన్నికల తర్వాత బీఆర్ఎస్ పార్టీ ఉండదన్నారు. వివిధ పార్టీల నుంచి సుమారు 500 వందల మంది కార్యకర్తలు మంత్రి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమాల్లో జడ్పీటీసీ చిట్లవెంకన్న, మాజీ జడ్పీటీసీలు మందడి రాంచంద్రారెడ్డి, నర్సింగ్ శ్రీనివాస్‌గౌడ్, నాయకులు గడ్డం అనూప్‌రెడ్డి, బిక్షంయాదవ్, దేవిరెడ్డి వెంకట్‌రెడ్డి, అంజిరెడ్డి, గోలిజగాల్‌రెడ్డి, భారతవెంకటేశం, నర్సింగ్‌లక్ష్మయ్య, మురళిగౌడ్, బిళ్లపాటి మోహన్‌రెడ్డి, రాజారెడ్డి, కరీంముల్లా పాల్గొన్నారు.

కాంగ్రెస్ కుటుంబ పాలన మనకొద్దు

● గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్


సూర్యాపేట జిల్లా పెన్‌పహాడ్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజాసింగ్

పెన్‌పహాడ్, మే 9: కాంగ్రెస్ కుటుంబ పాలనతో విసిగిన ప్రజలు బీజేపీ వైపు మొగ్గు చూపుతున్నారని గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ అన్నారు. సూర్యాపేట జిల్లా పెన్‌పహాడ్ మండలకేంద్రంలో గురువారం నిర్వహించిన రోడ్ షోలో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన రాహుల్‌గాంధీ, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, జానారెడ్డి వారి కుటుంబసభ్యులు మాత్రమే ఎంపీలు, ఎమ్మెల్యేలు కావాలని చూస్తున్నారన్నారు. ప్రధాని మోదీ పంపిన నిధులతో ఇప్పటి వరకు తెలంగాణ రాష్ట్రంలో అభివృద్ధి జరిగిందన్నారు. భారతదేశంపై టెర్రరిజం దాడులు చేసే ప్రయత్నంలో మోదీ ప్రభుత్వం శత్రువులను తిప్పికొట్టి దేశాన్ని కాపాడుతుందన్నారు. బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంకినేని వెంకటేశ్వర్‌రావు మాట్లాడుతూ కాంగ్రెస్, కమ్యూనిస్టులు ఏకమై బీజేపీని ఓడించాలని చూస్తున్నారన్నారు. కార్యక్రమంలో బీజేపీ ఎంపీ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి, మాజీ మునిసిపల్ చైర్మన్ జుట్టుకొండ సత్యనారాయణ, నాయకులు కర్నాటి కిషన్, రాములు, తూముల సాయిప్రసాద్, చెన్ను రమణారెడ్డి, రంగినేని విజయ్‌కుమార్, బచ్చు గుర్వయ్య పాల్గొన్నారు.

సూర్యాపేట సిటీ: దేశం కోసం పనిచేసే నాయకుడు నరేంద్రమోదీ అని గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ అన్నారు. సూర్యాపేట జిల్లాకేంద్రానికి వచ్చిన ఆయన బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు సంకినేని వెంకటేశ్వర్‌రావు, నల్లగొండ బీజేపీ పార్లమెంట్ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డితో కలిసి మీడియాతో మాట్లాడారు. ముస్లిం మహిళల కోసం ట్రిబుల్ తలాక్ తీసుకురావడం, చేతి వృత్తులు చేసుకునే పేదల కోసం విశ్వకర్మ యోజన పథకం ద్వారా రుణాలు అందించారన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు గోగుల రమేష్, సలిగంటి వీరేందర్, పోలగాని ధనుంజయ్‌గౌడ్, పల్స మల్సూర్‌గౌడ్ పాల్గొన్నారు.

నేరేడుచర్ల: మోదీని ఆపే బలం ఇండియా కూటమికి లేదని గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ అన్నారు. నేరేడుచర్లలో జరిగిన రోడ్‌షోలో మాట్లాడారు. మోదీ మూడోసారి ప్రధాని కావడం ఖాయమన్నారు. గతంలో కుంభకోణాలతో సంసారం చేసిన కాంగ్రెస్‌కు ఓటు అడిగే అర్హత లేదన్నారు. కార్యక్రమంలో బీజేపీ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి, సంకినేని వెంకటేశ్వరరావు, బొబ్బా భాగ్యరెడ్డి, చల్లా శ్రీలతారెడ్డి, పోకల వెంకటేశ్వర్లు, నరేష్, సోమిరెడ్డి పాల్గొన్నారు.

మిర్యాలగూడ టౌన్: బీజేపీని గెలిపించాలని గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ అన్నారు. నల్లగొండ జిల్లా మిర్యాలగూడలో ఎంపీ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి, పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి ప్రేమేందర్‌రెడ్డితో కలిసి రోడ్ షో నిర్వహించారు. దేశం కోసం జరుగుతున్న ఈ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థులను గెలిపిస్తే మూడోసారి మోదీ ప్రధాని అవుతారన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు వర్షిత్‌రెడ్డి, సాదినేని శ్రీనివాసరావు, తుమ్మలపల్లి హన్మంతరెడ్డి, కనపర్తి సత్యప్రసాద్, రేపాల పురుషోత్తంరెడ్డి, ఎడ్ల రమేష్, బంటు సైదులు, సీతారాంరెడ్డి, నాగిరెడ్డి, శ్యాం, వెంకటరెడ్డి సరిత, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

ఆంగోతుతండాలో వ్యక్తి దారుణహత్య


సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

కొండమల్లేపల్లి, మే 9: ఇంటి ఎదుట మంచంపై నిద్రిస్తున్న వ్యక్తిని గుర్తుతెలియని వ్యక్తులు దారుణంగా హత్య చేశారు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా కొండమల్లేపల్లి మండలంలోని ఆంగోతుతండాలో బుధవారం అర్ధరాత్రి జరిగింది. సీఐ ధనుంజయగౌడ్, ఎస్ఐ రామ్మూర్తి తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన ఆంగోతు జగ్రు(50) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. బుధవారం ఉదయం కుటుంబసభ్యులతో కలిసి మండలంలోని కోల్‌ముంతల్‌పహాడ్ గ్రామపంచాయతీ పరిధిలోని మంత్ర్యాతండాలో జరిగిన శుభకార్యానికి వెళ్లాడు. సాయంత్రం చిన్న కుమార్తెతో కలిసి ఇంటికి వచ్చాడు. కుమార్తె ఇంట్లో నిద్రించింది. జగ్రు ఇంటి ఎదుట మంచంలో నిద్రిస్తుండగా అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు గొడ్డలితో తలపై విచక్షణ రహితంగా దాడి చేశారు. దీంతో జగ్రు అక్కడికక్కడే మృతిచెందాడు. తెల్లవారుజామున అలజడి వస్తుండడంతో జగ్రు కూతురు బయటికి వచ్చింది. తండ్రి మంచంపై రక్తపు మడుగులో పడి ఉండడంతో ఆమె వెంటనే చుట్టుపక్కల వారికి సమాచారం ఇచ్చింది. వారు వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు గ్రామానికి చేరుకొని సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం దేవరకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. జగ్రు భార్య బుజ్జి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ధనుంజయగౌడ్, ఎస్ఐ రామ్మూర్తి తెలిపారు. జగ్రుకు భార్య, నలుగురు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. ముగ్గురు కుమార్తెలకు వివాహాలయ్యాయి. కుమారుడు హైదరాబాద్‌లో ఇంజనీరింగ్ చదువుతున్నాడు. గ్రామానికి చెందిన ముగ్గురు అనుమానితులను పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు సమాచారం. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా కేంద్ర బలగాలు గ్రామంలో పికెటింగ్ నిర్వహిస్తున్నాయి.

25 బీరు బాటిళ్లు స్వాధీనం

మర్రిగూడ, మే 9: నల్లగొండ జిల్లా మర్రిగూడ మండలంలోని తూర్పుతండాలో రూ.6వేల విలువ చేసే మద్యం బీర్ బాటిళ్లను పోలీసులు గురువారం స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ రంగారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... ఎన్నికల నిబంధనలను ఉల్లంఘిస్తూ మండలంలోని తూర్పుతండాలో పత్లావత్ నితీన్ ఇంట్లో అనుమతులు లేకుండా ఇంట్లో 25బీర్ బాటిళ్లు ఉంచి విక్రయిస్తున్నట్లు సమాచారంతో స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

యువతి అదృశ్యం.. కేసు నమోదు

తిప్పర్తి, మే 9: మండల కేంద్రానికి చెందిన యువతి అదృశ్యమైంది. ఎస్ఐ రాజు తెలిపిన వివరాల ప్రకారం... తిప్పర్తి మండలకేంద్రానికి చెందిన జేరిపోతుల రేణుక(22) బుధవారం మధ్యాహ్నం సమయంలో కిరాణం దుకాణం వద్దకు వెళ్లి వస్తానని ఇంట్లో చెప్పి బైటికి వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. సాయంత్రం వరకు రాకపోవడంతో యువతి తండ్రి జేరిపోతుల యాదయ్య తన కూతురు మిస్సింగ్‌పై అదే గ్రామానికి చెందిన దొడ్డేని నాగరాజు అనే యువకునిపై అనుమానం ఉందని పోలీస్‌స్టేషన్‌లో గురువారం ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

కారు ఢీకొని వ్యక్తికి గాయాలు

హాలియా, మే, 9: కారు ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన నల్లగొండ జిల్లా హాలియాలో బుధవారం రాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... హాలియా నుంచి మిర్యాలగూడ వైపు వెళ్తున్న టీఎస్ 10 ఈజే 3220 నెంబర్ గల కారు అతివేగంగా వస్తూ ఎదురుగా వస్తున్న టీఎస్ 05 ఎఫ్ఎస్ 5978 నెంబర్ గల బైక్‌ను ఢీకొట్టడంతో బైక్‌పై ఉన్న రసూల్‌గూడ నల్లగొండకు చెందిన తీగల శివశంకర్‌కు తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రుడిని నల్లగొండలోని ఆస్పత్రికి తరలించారు. శివశంకర్ సోదరుడు గౌతం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ. సతీష్‌రెడ్డి తెలిపారు.

ర్యాలీలో అపశ్రుతి.. ముగ్గురికి గాయాలు

గుండాల, మే9: పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలకేంద్రంలో ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్ రోడ్‌షో నిర్వహిస్తుండగా కార్యకర్తలు బాణాసంచా కాల్చారు. మినుగులు మీద పడతాయని భయంతో అక్కడ ఉన్న వారు పరుగెత్తడంతో కింద పడి ముగ్గురికి గాయాలయ్యాయి. మండల కేంద్రానికి చెందిన గిరికత్తుల సాత్విక అనే పాప జారి కిందపడడంతో కాలు విరిగింది. ప్రథమిక చికిత్స అనంతరం హైదరాబాద్‌కు తీసుకెళ్లారు. వస్తాకొండూరు గ్రామానికి చెందిన వంగాల అనిత కింద పడడంతో గాయమైంది. శ్రీహరి అనే వ్యక్తి కళ్లలో మినుగులు పడడంతో ప్రథమ చికిత్స నిర్వహించారు.

కోదాడ అభివృద్ధికి నాలుగు నెలల్లో రూ.436కోట్లు

● ఎమ్మెల్యే పద్మావతి ● జిల్లా వ్యాప్తంగా కాంగ్రెస్ నేతల ప్రచారం ● పాల్గొన్న మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి



దురాజ్‌పల్లిలో ప్రచారంలో పాల్గొన్న మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి

ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్: కోదాడ నియోజకవర్గ అభ్యర్థికి నాలుగు నెలల్లో రూ.436 కోట్ల నిధులు విడుదల చేశామని ఎమ్మెల్యే పద్మావతి అన్నారు. గురువారం రాత్రి మండలంలోని కాపుగల్లు గ్రామంలో నిర్వహించిన బహిరంగ సభలో ఆమె మాట్లాడారు. కాపుగల్లులోని బీడు భూములను సస్యశ్యామలం చేసేందుకు పాలేరు వాగుపై రూ.55 కోట్లతో లిఫ్ట్ ఇరిగేషన్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. గతంలో టీడీపీకి కంచుకోటగా ఉన్న కాపుగల్లు, నేడు కాంగ్రెస్ పార్టీ కంచుకోటగా మారిందన్నారు. కాపుగల్లు గ్రామానికి బస్సు సౌకర్యం లేనందున ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని మహిళలు వినియోగించుకోలేకపోతున్నారని, ఆ గ్రామ మాజీ సర్పంచ్ తొండపు సతీష్ ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. సమస్యను పరిష్కరిస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. గ్రామంలో అర్హులైన పేదలందరికీ ఇళ్లను నిర్మించి ఇస్తామన్నారు. గ్రామంలో సీసీ రోడ్ల నిర్మాణానికి రూ.70లక్షలు మంజూరు చేశామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ మల్లెల రాణి బ్రహ్మయ్య, జడ్పీటీసీ కృష్ణకుమారి, తూమాటి వరప్రసాద్‌రెడ్డి, మాజీ సర్పంచ్ తొండపు సతీష్, రేవూరి వెంకటాచారి, సూర్యం, హనుమంతరావు,పాల్గొన్నారు.

● నల్లగొండ పార్లమెంట్ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి కుందూరు రఘువీర్‌రెడ్డిని గెలిపించాలని ఎమ్మెల్యే పద్మావతి కోరారు. ఈ మేరకు మోతె మండలంలోని సిరకొండ, రాయిపాడు, సర్వారం, విభలాపురం, అపన్నగూడెం గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించి మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీపీ ముప్పాని ఆశ, జడ్పీటీసీ పుల్లారావు పాల్గొన్నారు.

● కోదాడ మండలంలోని రామలక్ష్మీపురం గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు అన్నెం రవీందర్‌రెడ్డి, నడిగూడెం ఎంపీపీ యాతాకుల జ్యోతి మధుబాబు ఆ పార్టీకి రాజీనామా చేసి, ఎమ్మెల్యే పద్మావతి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ బీఆర్‌ఎస్ అభ్యర్థి రఘువీర్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గంగిరెడ్డి కామారెడ్డి, అన్నెం పాపిరెడ్డి, నరసింహారెడ్డి పాల్గొన్నారు.

● బీఆర్‌ఎస్ నాయకుడు మల్లు జగన్నాథరెడ్డి పార్టీ అధ్యక్ష పదవికి రాజీనామా చేశారు. కోదాడ మాజీ ఎమ్మెల్యే వేనేపల్లి చందర్‌రావు, చింతకుంట్ల లక్ష్మీనారాయణరెడ్డి, ముత్తవరపు పాండురంగారావు, ఎర్నేని బాబు, రామారావు, కౌన్సిలర్ కర్రీ శివసుబ్బారావు సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు

● నల్గొండ పార్లమెంట్ నియోజకవర్గ స్థానంలో సీపీఐ బలబర్చిన కాంగ్రెస్ అభ్యర్థి కుందూరు రఘువీర్‌రెడ్డిని గెలిపించాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గన్నా చంద్రశేఖర్ కోరారు. గరిడేపల్లి మండలంలోని గానుగబండ గ్రామంలో నిర్వహించిన సీపీఐ కార్యవర్గ సభ్యుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో పోకల వెంకటేశ్వర్లు, కడియాల అప్పయ్య, వెంకటేశ్వర్లు, రాములు, వెంకటేశ్వర్లు, రాంరెడ్డి పాల్గొన్నారు.

● అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను, అధికారంలోకి వచ్చిన అతి తక్కువ సమయంలో అమలుచేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్, టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పటేల్ రమేష్‌రెడ్డి అన్నారు.జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో బీఆర్‌ఎస్ పార్టీ నాయకుడు డాక్టర్ రామూర్తియాదవ్, నిమ్మల వెంకన్న, గాయం కరుణాకర్‌రెడ్డి, బొల్లెద్దు వినయ్ కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా రమేష్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో 14నుంచి 15పార్లమెంట్ స్థానాల్లో కాంగ్రెస్ విజయం సాధిస్తుందన్నారు. నల్లగొండ పార్లమెంట్ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి కుందూరు రఘువీర్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ముద్దిరెడ్డి రమణారెడ్డి, గట్టు శ్రీనివాస్, షఫీవుల్లా, వెలుగు వెంకన్న, నామా అరుణ పాల్గొన్నారు.

● నల్గొండ పార్లమెంట్ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి రఘువీర్‌రెడ్డిని గెలిపించాలని ఆ పార్టీ నాయకుడు ఆధూరి కిషోర్‌రెడ్డి కోరారు. మండలంలోని మఠంపల్లితో పాటు పలు గ్రామాల్లో సీపీఎం నాయకులతో కలిసి ఆయన ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో సింగారపుసైదులు, సక్యనాయక్, ఎల్లారెడి పాల్గొన్నారు.

● ప్రజాస్వామ్యాన్ని కాపాడండి.. కాంగ్రెస్‌ను గెలిపించండని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మేకల శ్రీనివాసరావు ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. కోదాడ పట్టణంలోని పలు వార్డుల్లో ఆయన ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యదర్శి షేక్ లతీఫ్ గురుమూర్తి, సీపీఐ నాయకులు శ్రీనివాస్, షేక్ జానీ, పాల్గొన్నారు.

● పాలకవీడు మండలంలో బీఆర్‌ఎస్‌కు భారీ షాక్ తగిలింది. బీఆర్‌ఎస్ మండల మాజీ అధ్యక్షుడు, రైతు సమన్వయం సంఘం జిల్లా సభ్యుడు మలమంటి దర్గారావు, బీఆర్‌ఎస్ మండల మహిళా అధ్యక్షురాలు అచ్చమ్మతో పలువురు మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ లో చేరారు కార్యక్రమంలో ఎంపీపీ గోపాల్, వెంకట్‌రెడ్డి, నర్సింహారావు పాలొన్నారు.

● మంత్రి ఉత్తమ్‌తోనే అభివృద్ధి సాధ్యమవుతుందని హుజూర్‌నగర్ ఎంపీపీ గూడెపు శ్రీనివాస్, కాంగ్రెస్ నాయకుడు చావా సహదేవరావు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సాముల శివారెడ్డి అన్నారు. మండలంలోని శ్రీనివాసపురం గ్రామంలో నిర్వహించిన కాంగ్రెస్ ముఖ్య కార్యకర్తల మావేశంలో వారు మాట్లాడారు. కాంగ్రెస్ అభ్యర్థి అభ్యర్థి రఘువీర్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. అనంతరం గ్రామంలో భారీ ర్యాలీ నిర్వహించారు. సమావేశంలో చావా వీరభద్రరావుచౌదరి,పెద్ద గోపాలరావు పాల్గొన్నారు.

● కాంగ్రెస్ కార్యకర్తలను కంటికి రెప్పలా ఎమ్మెల్యే మందుల సామేల్ అన్నారు. మద్దిరాల మండల కేంద్రంలో ఎమ్మెల్యే సమక్షంలో తిరుమలగిరి మండలంలోని పోలుమళ్ల గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు చెవిటి వెంకన్న యాదవ్, నాయకులు అవిలమల్లు, శ్యామ్‌రెడ్డి, ఆదిరెడ్డి పాల్గొన్నారు.



హుజూర్‌నగర్ మండలంలోని శ్రీనివాసపురం గ్రామంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకుడు చావా సహదేవరావు



కోదాడలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పద్మావతి

● భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డిని గెలిపించాలని ఆ పార్టీ తిరుమలగిరి పట్టణ అధ్యక్షుడు పేరాల వీరేష్ కోరారు. తిరుమలగిరిలోఆయన ప్రచారం నిర్వహించారు.

● రైతుల పంట రుణ మాఫీని కాంగ్రెస్ ప్రభుత్వం ఆగస్టు 15వ తేదీ లోగా చేస్తుందని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు చెవిటి వెంకన్నయాదవ్ అన్నారు. భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డిని గెలిపించాలని కోరుతూ తుంగుతుర్తి మండలంలోని తూర్పుగూడెం, గానుగబండ గ్రామాల్లో ఆయన ప్రచారం చేశారు. ఆయా గ్రామాల్లో 'ఉపాధి' కూలీలకు మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు.

● భువనగిరి పార్లమెంటు నియోజకవర్గంలో సీపీఐ బలపరిచిన కాంగ్రెస్ అభ్యర్థి చామల కిరణ్‌కుమార్‌రెడ్డిని గెలిపించాలని సీపీఐ జిల్లా నాయకుడు తొట్ల ప్రభాకర్‌గౌడ్ కోరారు. నూతనకల్‌లో ఆయనమాట్లాడారు.

● దేశాన్ని బీజేపీ నుంచి కాపాడుకునేందుకే కాంగ్రెస్‌కు మద్దతు తెలుపుతున్నామని టీపీసీసీ లీగల్ సెల్, మానవహక్కులు, సమాచార హక్కు చట్ట విభాగం జిల్లా చైర్మన్ నూకల సుదర్శన్‌రెడ్డి అన్నారు. సూర్యాపేటలోని న్యాయవాది మారపాక వెంకన్న నివాసంలో కాంగ్రెస్, మిత్రపక్షాల న్యాయవాదులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో న్యాయవాదులు టెకులపల్లి శ్రీనివాస్‌రావు, సోమేశ్వర్, నర్సయ్య పాల్గొన్నారు.

● నల్లగొండ పార్లమెంట్ నియోజవర్గ కాంగ్రెస్ అభ్యర్థి కుందూరు రఘువీర్‌రెడ్డిని గెలిపించాలని మాజీ మంత్రి, టీపీసీసీ ఉపాధ్యక్షుడు రాంరెడ్డి దామోదర్‌రెడ్డి కోరారు. సూర్యాపేటలోని దురాజ్‌పల్లితో పాటు పట్టణంలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆయన మాట్లాడారు కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే వేదాసు వెంకయ్య, ఏఐసీసీ సభ్యులు రాంరెడ్డి సర్వోత్తంరెడ్డి, కొప్పుల వేణారెడ్డి, అంజద్అలీ, కక్కిరేణి శ్రీనివాస్, రావుల రాంబాబు, చెంచల శ్రీనివాస్, సునీల్‌రెడ్డి, నిఖిల్‌నాయుడు, రవి, జనార్దన్ పాల్గొన్నారు.

● కాంగ్రెస్ అభ్యర్థి కుందూరు రఘువీర్‌రెడ్డిని గెలిపించాలని గరిడేపల్లి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు త్రిపురం అంజన్‌రెడ్డి కోరారు. మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో ఆయన ప్రచారం చేశారు.

చంద్రబాబు సీఎం కావాలని ప్రత్యేక పూజలు



సాయిబాబా మందిరంలో పూజల్లో పాల్గొన్న టీడీపీ నాయకులు

నడిగూడెం, మే 9: టీడీపీ అధినేత చంద్రబాబు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సీఎం కావాలని కోరుకుంటూ గురువారం నడిగూడెంలోని సాయిబాబా మందిరంలో టీడీపీ మండల నాయకులు, కార్యకర్తలు ప్రత్యేక పూజలు చేయించారు. ఈ మేరకు ఆలయంలో 101కొబ్బరికాయలు కొట్టి మొక్కుకున్నారు. ఈ సందర్భంగా టీడీపీ నడిగూడెం మండల అధ్యక్షుడు దొంతగాని శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చంద్రబాబు సీఎం కావాలని, జగన్ ఆరాచక పాలనకు చరమగీతం పాడాలని ప్రజలు కోరుకుంటున్నారని తెలిపారు. టీడీపీ బలంతో తెలంగాణలో రేవంత్‌రెడ్డి సీఎం అయ్యారని, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో చంద్రబాబు విజయం సాధిస్తే, రెండు తెలుగు రాష్ట్రాలు అభివృద్ధి చెందుతాయన్నారు. కార్యక్రమంలో జహీర్, వీరన్న, సీతయ్య, పిచ్చయ్య, ఆంజనేయులు, నర్సయ్య, సయాజ్, కాశిం, వెంకన్న, వీరబాబు పాల్గొన్నారు.

తాటిచెట్టు పైనుంచి పడి గీత కార్మికుడికి గాయాలు

ఆత్మకూర్(ఎస్), మే 9: తాటిచెట్టు ఎక్కుతూ ప్రమాదవశాత్తు జారి పడడంతో గీత కార్మికుడికి తీవ్రగాయలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని పాతర్లపహాడ్ గ్రామానికి చెందిన గీత కార్మికుడు తండు కృష్ణయ్య, రోజుటి మాదిరిగా కల్లుగీయడాకి గ్రామ శివారులోని తాటి చెట్టు ఎక్కుతూ, ప్రమాదవశాత్తు మోకు జారడంతో కింద పడటంతో తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు కృష్ణయ్యను చికిత్స నిమిత్తం సూర్యాపేట జనరల్ ఆసుపత్రికి తరలించారు.

విద్యార్థులు అంకితభావంతో చదవాలి



తిరుమలగిరి కృష్ణవేణి పాఠశాల విద్యార్థిని కీర్తిప్రియను అభినందిస్తున్న కలెక్టర్ వెంకట్రావు

తిరుమలగిరి, నాగారం, మే 9: విద్యార్థులు అంకితభావంతో చదవాలని కలెక్టర్ వెంకట్రావు అన్నారు. పదో తరగతి పరీక్షా ఫలితాల్లో 10/10జీపీఏ సాధిం చిన తిరుమలగిరి కృష్ణవేణి పాఠశాల విద్యార్థిని కీర్తిప్రియను. నాగారం మండలం పసునూరు మోడల్‌స్కూల్‌లో విద్యార్థినులు మల్లెపాక శ్రుతి, గుండ్ల అభినయను కలెక్టరేట్‌లో గురువారం అభినందించి మాట్లాడారు. కార్యక్రమంలో డీఈవో అశోక్, ఎంఈవో శాంతయ్య, ప్రిన్సిపాల్స్ నగేష్ కుంట రమేష్, పాల్గొన్నారు.

పేదల కోసం అలుపెరుగని పోరాటం చేసిన బీఎన్ రెడ్డి



కొత్తగూడెం గ్రామంలో బీఎన్ రెడ్డి విగ్రహానికి నివాళులర్పించిన మల్లు లక్ష్మి

తుంగతుర్తి, సూర్యాపేట అర్బన్, మే 9: పేదల కోసం తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు భీంరెడ్డి నర్సింహారెడ్డి(బీఎన్ రెడ్డి) అలుపెరగని పోరాటం చేశారని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యురాలు మల్లు లక్ష్మి అన్నారు. గురువారం మండలంలోని కొత్తగూడెం గ్రామంలో మండల కార్యదర్శి బుర్ర శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన బీఎన్ రెడ్డి వర్ధంతి కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ముందుగా బీఎన్ రెడ్డి విగ్రహానికి నివాళులర్పించారు.కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు కొలిశెట్టి యాదగిరిరావు, కోట గోపి, జిల్లా కమిటీ సభ్యులు శంకర్ రెడ్డి, పులుసు సత్యం, వెంకట్‌రెడ్డి, వెంకన్న, ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర కార్యదర్శి నాగరాజు, గిరిజన సంఘం రాష్ట్ర కార్యదర్శి ధర్మానాయక్, మాజీ జడ్పీటీసీ విజయమ్మ, కవిత, లక్ష్మయ్య, చంద్రయ్య, మల్లయ్య లింగమ్మపాల్గొన్నారు.

● నైజాం నిరంకుశత్వంపై తిరుగుబాటు జెండా ఎగురవేసిన దీశాలి బీఎన్‌రెడ్డి పోరాట చరిత్ర మరువలేనిదని ఎంసీపీఐ(యు) కేంద్ర కమిటీ సభ్యుడు వరికుప్పల వెంకన్న అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. భవిష్యత్ తరాలకు బీఎన్‌రెడ్డి చరిత్రను అందించే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. కార్యక్రమంలో మోరపాక ఉగ్రయ్య, రాజు, ఓంకార్, సోమయ్య, ఎల్లమ్మ, సైదులు పాల్గొన్నారు.

వేసవి ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న సంకినేని కృష్ణారావు

సూర్యాపేట అర్బన్, మే 9: అక్షర ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే వేసవి ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని ఎస్ఆర్‌కే కన్‌స్ట్రక్షన్ మేనేజింగ్ డైరెక్టర్ సంకినేని కృష్ణారావు అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని ఎవీఎం పాఠశాలలో నిర్వహించే అక్షర ఫౌండేషన్ వేసవి శిక్షణ తరగతులను ప్రారంభించి మాట్లాడారు శిక్షణ పొందడానికి 350మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారని తెలిపారు. కార్యక్రమంలో సుధాకర్ పీవీసీ డైరెక్టర్ మీలా రవిశంకర్, అక్షర ఫౌండేషన్ చైర్మన్ యాస రాంకుమార్‌రెడ్డి, నాగయ్య, దామోదర్‌రెడ్డి, అచ్యుతరామ శర్మ, రమాదేవి, పాపాయ్య, గురుచరణ్, గణేష్, నజీర్‌పాషా, ప్రియాంక, సంధ్య లక్ష్మి, వినయ్‌కుమార్‌రెడ్డి, నారాయణరెడ్డి పాల్గొన్నారు.

'బీజేపీ గెలిస్తే రాజ్యాంగానికి ప్రమాదం'

నాగారం, సూర్యాపేట అర్బన్, మే 9: పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ గెలిస్తే రాజ్యాంగానికి ప్రమాదం పొంచిఉందని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎల్లెంల యాదగిరి అన్నారు. గురువారం మండలంలోని నర్సింహులగూడెంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రధాని నరేంద్ర మోదీ దేశ సంపదను కార్పొరేట్ శక్తులకు దోచిపెడుతూ ప్రజలను నమ్మించి మోసం చేశారని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం రైతు వ్యతిరేక చట్టాలను తెచ్చిందని విమర్శించారు. ప్రజలు బీజేపీని ఓడించి లౌకిక ప్రజాస్వామ్యన్ని కాపాడే కాంగ్రెస్ గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నితిన్‌కుమార్, ముఖేష్, ధర్మేంద్ర, సత్తయ్య, ఆశోక్ పాల్గొన్నారు.

●పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని ఓడించాలని ఏఐకేఎంఎస్ రాష్ట్ర సహాయ కార్యదర్శి మందారి డేవిడ్ కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రానున్న పార్లమెంట్ ఎన్నికలు దేశభవిష్యత్‌ను, భావి జీవితాలను నిర్ణయించబోతున్నాయని తెలిపారు. కార్యక్రమంలో బొడ్డు శంకర్, రంగారెడ్డి, కనకారావు, శ్రీనివాస్‌రెడ్డి, నాగయ్య, లింగయ్య పాల్గొన్నారు.

వైభవంగా లక్ష మల్లెల ఆర్చన



సాయిబాబా ఆలయంలో లక్ష మల్లెలార్చనలో పాల్గొన్న భక్తులు

మేళ్లచెర్వు, మే 9: మండల కేంద్రంలోని సాయిబాబా ఆలయం 23వ వార్షికోత్సవం సందర్భంగా గురువారం లక్ష మల్లెల ఆర్చన నిర్వహించారు. వేకువజామున స్వామివారికి పంచామృత అభిషేకం నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలోని అన్నపూర్ణదేవి, విశ్వేశ్వరస్వామికి శాంతి కల్యాణాన్ని కొంకపాక రాధాకృష్ణమూర్తి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా గణపతి పూజ, పుణ్యాహవచనం, రక్షాబంధనం, యజ్ఞోపవీత దారణ, మాంగల్యదారణ, షోడశోపచార పూజలు చేశారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలతో పాటు అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో కొంకపాక విష్ణువర్ధన్‌శర్మ, ధనుంజయశర్మ, భక్తులు పాల్గొన్నారు.

ఆలయంలో ప్రత్యేక పూజలు



కనకదుర్గమ్మ దేవాలయంలో పూజల్లో పాల్గొన్న భక్తులు

చిలుకూరు, మే 9: మండలంలోని నారాయణపురం గ్రామంలో నూతనంగా నిర్మించిన కనక దుర్గ దేవాలయంలో గురువారం పాల పొంగళ్ల కార్యక్రమాన్ని భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. విగ్రహ ప్రతిష్ఠ, జీవధ్వజ స్తంభ ప్రతిష్ఠ కార్యక్రమాలు నిర్వహించి 16రోజులు పూర్తయిన సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. . ఈ సందర్భంగా భక్తులుమొక్కులు చెల్లించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

సంప్రదాయబద్ధంగా శ్రీలక్ష్మీనృసింహుని కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న పూజారులు

మఠంపల్లి, మే 9: మండలంలోని మట్టపల్లి క్షేత్రంలో గురువారం శ్రీలక్ష్మీనృసింహుని నిత్య కల్యాణాన్ని తూమాటి రామాచార్యులు, పద్మనాభాచార్యులు, లక్ష్మీనరసింహమూర్తి, ఆంజనేయచార్యుల ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో విష్వక్సేన ఆరాధన, పుణ్యాహవాచనం, రక్షాబంధనం, రుత్విగ్వరణం, పంచగవ్యప్రాసన అనంతరం స్వామివారికి మాంగల్యధారణ, తలంబ్రాలతో నిత్య కల్యాణాన్ని జరిపించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.కార్యక్రమంలో ఆలయ ధర్మకర్తలు చెన్నూరి విజయ్‌కుమార్, మట్టపల్లిరావు, ఈవో నవీన్, పాల్గొన్నారు.

'ప్రజాసమస్యలపై సీపీఎం పోరాటం'

మద్దిరాల, మే 9: ప్రజా సమస్యలపై నిరంతరం సీపీఎం పోరాటం చేస్తోందని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున్‌రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని పోలుమళ్ల గ్రామంలో వివిధ పార్టీలకు చెందిన 10 కుటుంబాలు ఆయన సమక్షంలో సీపీఎంలో చేరాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ సీపీఎం అభ్యర్థి జహంగీర్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు కోట గోపి, బెల్లకొండ వెంకటేశ్వర్లు, నాగరాజు, వేల్పుల వెంకన్న, దామెర కిరణ్, మధు, పాతూరి మల్లారెడ్డి, నారాయణ పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ సామగ్రి చోరీ

పాలకవీడు, మే 9: మండలకేంద్రంలోని జాన్‌పహాడ్ రోడ్డులో 25కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌ను గుర్తు తెలియని వ్యక్తులు బుధవారం రాత్రి ధ్వసం చేసినట్లు స్థానికులు తెలిపారు. ట్రాన్స్‌ఫార్మర్‌ను దిమ్మె నుంచి కిందకు దించి రాగి తీగను, విలువైన సామగ్రిని అపహరించారు. గురువారం ఉదయం గమనించిన రైతులు పోలీసులకు, విద్యుత్ అధికారులకు సమాచాం ఇవ్వగా, వారు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. పోలీసులు కేసు నమోదు చేశారు. మూడు రోజుల క్రితం మండలంలో ఇలాంటి ఘటనే జరిగింది. దీంతో రైతుల ఆందోళన చెందుతున్నారు

బీఆర్‌ఎస్ హయాంలో సకాలంలో సాగు, తాగు నీరు



పెన్‌పహాడ్ మండలం మాచారంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జగదీష్‌రెడ్డి

పెన్‌పహాడ్, సూర్యాపేట(కలెక్టరేట్), తుంగతుర్తి, కోదాడ టౌన్, తిరుమలగిరి మద్దిరాల మునగాల రూరల్, నూతనకల్, చిలుకూరు, మే 9: బీఆర్‌ఎస్ హయాంలో రైతులకు, ప్రజలకు సకాంలో సాగు, తాగు నీరు అందజేశామని ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్‌రెడ్డి కాంగ్రెస్ ఆరు గ్యారెంటీ హామీలను ఇచ్చి ప్రజలను మోసం చేసిందన్నారుజ ప్రజావ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న బీజేపీ, కాంగ్రెస్‌లకు బుద్ధి చెప్పాలని, నల్లగొండ పార్లమెంట్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ అభ్యర్థి కంచర్ల రామకృష్ణారెడ్డిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ నెమ్మాది భిక్షం, వైస్ ఎంపీపీ గార్లపాటి సింగారెడ్డి, మండల అధ్యక్షుడు దొంగరి యుగేందర్, వెన్న సీతారాంరెడ్డి, పొదిల నాగార్జున, బైరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్,నాగేశ్వర్‌రావు పాల్గొన్నారు.

● అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని రాజ్యసభ మాజీ సభ్యుడు, బీఆర్‌ఎస్ జిల్లాఅధ్యక్షుడు బడుగుల లింగయ్యయాదవ్ అన్నారు. నల్లగొండ పార్లమెంట్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డిని గెలిపించాలని కోరుతూ జిల్లా కేంద్రంలో ఆయన ప్రచారం చేశారు. కార్యక్రమంలో శ్రీనివాస్‌గౌడ్, ప్రకాష్,పాల్గొన్నారు.

● తుంగతుర్తి నియోజకవర్గంలో1.40లక్షల ఎకరాలకు సాగు నీరందించిన ఘనత కేసీఆర్‌కే దక్కిందని మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్‌కుమార్, జిల్లా పరిషత్ చైర్మన్ గుజ్జ దీపిక అన్నారు. తుంగుర్తి మండలంలోని గొట్టిపర్తి గ్రామంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో, నూతనకల్ మండలం ఎడవెల్లి గ్రామంలో నిర్వహించిన ఎన్ని ప్రచారంలో మాట్లాడారు..కార్యక్రమంలో గుండగాని రాములుగౌడ్, తాటికొండ సీతయ్య, శ్రీశైలం, సాయిలు, హరిబాబు పాల్గొన్నారు.

● ఎబీఆర్‌ఎస్ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డిని గెలిపించాలని బీఆర్‌ఎస్ నాయకుడు, కార్మిక విభాగం జిల్లా కార్యదర్శి షేక్ నయీం కోదాడలోని 33వ వార్డులో ఆయన ప్రచారం చేశారు.

● భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ అభ్యర్థి క్యామ మల్లేష్‌ను గెలిపించాలని ఎస్‌ఏ రజాక్ కోరారు. మద్దిరాల మండల కేంద్రంలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆయన మాట్లాడారు.

●బీఆర్‌ఎస్ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి గెలపించాలని బీఆర్‌ఎస్ కోదాడ ఎన్నికల ఇన్‌చార్జి ఎత్తయ్యగౌడ్ కోరారు. మండలంలోని కలకోవ గ్రామంలో నిర్వహించిన ప్రచారంలో ఆయన మాట్లాడారు.

● తిరుమలగిరి మునిసిపాలిటీ కేంద్రంలో శుక్రవారం నిర్వహించే ఎన్నికల ప్రచారానికి భువనగిరి పార్లమెంట్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ అభ్యర్థి క్యామ మల్లేష్ హాజరవుతున్నారని, ఈ సందర్భంగా నిర్వహించే ర్యాలీని విజయవంతం చేయాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు సంకెపల్లి రఘునందన్‌రెడ్డి కోరారు. తిరుమలగిరిలోని పలు వార్డుల్లో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆయన మాట్లాడారు.

ప్రజాస్వామ్య పరిరక్షణకు ఓటు వజ్రాయుధం



కోదాడలో అవగాహన ర్యాలీలో పాల్గొన్న ఆర్డీవో సూర్యనారాయణ

కోదాడ టౌన్, మే 9: ప్రజాస్వామ్య పరిరక్షణకు ఓటు వజ్రాయుధం లాంటిదని, అర్హులైన ప్రతిఒక్కరూ ఓటు వేయాలని కోదాడ ఆర్డీవో సూర్యనారాయణ అన్నారు. పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఓటుపై అవగాహన కల్పించడానికి అన్ని శాఖల అధికారులు గురువారం కోదాడ పట్టణంలో ఖమ్మం క్రాస్ రోడ్డు నుంచి రంగా థియేటర్ చౌరస్తా వరకు ద్విచక్ర వాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ అర్హులైన ప్రతి ఒక్కరూ ఎలాంటి ప్రలోభాలకు గురికాకుండా నిష్పక్షపాతంగా ఓటు వేయాలన్నారు. 'ఓటు హక్కు.. జన్మ హక్కు' అంటూ ర్యాలీలో నినాదాలు చేశారు. ర్యాలీలో మునిసిపల్ కమిషనర్ రమాదేవి, తహసీల్దార్ సాయిగౌడ్, రవికుమార్, ఆంజనేయులు, ధ్రువకుమార్, ఎంఈవో సలీంషరీఫ్, అన్ని శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

భక్తులకు అసౌకర్యం కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలి



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో శ్రీనివాసులు

హుజూర్‌నగర్, మే 9: మఠంపల్లి మండలంలోని మట్టపల్లి లక్ష్మీ నరసింహస్వామి ఆలయ బ్రహ్మోత్సవాల్లో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా అధికారులు ఏర్పాట్లు చేయాలని ఆర్డీవో శ్రీనివాసులు కోరారు. ఈ నెల 21వ తేదీ నుంచి 26వ తేదీ వరకు నిర్వహించే బ్రహ్మోత్సవాలపై గురువారం హుజూర్‌నగర్‌లోని ఆర్డీవో కార్యాలయంలో వివిధశాఖల అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. 22న స్వామివారి కల్యాణం నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, పార్కింగ్ ఏర్పాట్లు పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. భక్తులకు మంచినీటి సరఫరా, భోజన వసతి కల్పించాలన్నారు. వివిధ కులాలకు చెందిన సత్రాలు ఉన్నందున భక్తులకు అన్నదానం చేయాలన్నారు. ప్రభుత్వశాఖల అధికారులు సమన్వయంతో వ్యవహరించి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. దేవాదాయశాఖ అధికారులు బాధ్యతగా వ్యవహరించాలన్నారు. కార్యక్రమంలో విజయ్‌కుమార్, మట్టపల్లిరావు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, , రెవెన్యూ, పోలీస్ సిబ్బంది, మండల పరిషత్ అధికారులు పాల్గొన్నారు.

శంకరమ్మతో పాటు పలువురు కాంగ్రెస్‌లో చేరిక



దీపాదాస్ మున్షీ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన నేతలు

హుజూర్‌నగర్, మే 9: హుజూర్‌నగర్ నియోజకవర్గానికి చెందిన కీలక నేతలు కారు దిగి హస్తం గూటికి చేరారు. బీఆర్‌ఎస్ నాయకురాలు, తెలంగాణ మలి ఉద్యమ తొలి అమరవీరుడు శ్రీకాంతాచారి తల్లి కాసోజు శంకరమ్మతో హుజూర్‌నగర్ నియోజవర్గంలోనిపలువురు గురువారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఏఐసీసీ ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ, నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరారు. కాంగ్రెస్‌లో చేరినవారిలో హుజూర్‌నగర్ మునిసిపల్ మాజీ చైర్మన్ జక్కుల వెంకయ్య, 23వ వార్డు కౌన్సిలర్ జక్కుల వీరయ్య, మాజీ ఎంపీపీలు నర్సింగ్ వెంకటేశ్వర్లు, అన్నెం శౌరెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కస్తాల రామయ్య, బీసీ నేత యర్రంశెట్టి పిచ్చయ్య, షఫీ, తండు సాయిరాం తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో యరగాని నాగన్నగౌడ్, తన్నీరు మల్లికార్జున్, సాముల రాంరెడ్డి, చావా కిరణ్మయి, గెల్లి రవి, ఎంపీపీ గూడెపు శ్రీను, కుందూరు శ్రీనివాసరెడ్డి, దొంతగాని శ్రీనివాస్‌గౌడ్, తండు ప్రసాద్ పాల్గొన్నారు.